

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
# అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 17.10.2025 | సంపుటి : 2 | సంచిక :253 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Friday 17.10.2025 volume : 2 Issue : 253 Pages : 8 Cost : 2/-

**విలేకరులు కావలెను**
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

# ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

**జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు**
**డ్రోన్ టెక్నాలజీలో కర్నూలుకు స్థానం**
**గూగుల్ రాకతో విశాఖ దశ మారుతుంది**
**రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌ల విజనరీ నాయకత్వం**
**కర్నూలు సభలో ప్రధాని మోదీ ప్రసంగం**

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు జరుగుతోందని, అయితే అది "ఒకల్ ఫర్ లోకల్" కావాలని ప్రధాని మోదీ అభిలషించారు. డ్రోన్ టెక్నాలజీకి కర్నూలు కేంద్రంగా మారబోతుందని తెలిపారు. మరోవైపు, ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించిందని, అందులో దేశీయ టెక్నాలజీ అద్భుతంగా పనిచేసిందని అన్నారు. ఇది మన ఆత్మనిర్భరతకు గర్వకారణమన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు.



రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

కర్నూలు, అక్టోబర్ 16 : సైన్స్, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని అన్నారు. ఏపీలో అనంత అవకాశాలతో పాటు యువతకు అపార శక్తి ఉందన్నారు. అహోబిలం నర్సింహ స్వామి, మహానంది ఈశ్వరుడికి నమస్కరిస్తున్నానని, మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నానని చెప్పారు. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల -మిగతా 2 లో..

# స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం తిరస్కరణ

## బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట

**పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లాలని సూచన**
**హైకోర్టు విచారణపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం**
**50 శాతం మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య**
**ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ**



సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ)ని సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు ప్రభుత్వానికి సూచించింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది.



న్యూఢిల్లీ, అక్టోబర్ 16: స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని పేర్కొంది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణ చేయలేమని -మిగతా 2 లో..

# ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారు

**పదేపదే ప్రశంసలే ఇందుకు నిదర్శనం**
**ఎక్స్ వేదికగా విపక్షనేత రాహుల్ విమర్శలు**



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఇకపై ఆపేస్తామని ప్రధాని నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వాటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారని ఎద్దేవా చేశారు.

# మీడియా ముందుకెళ్లొద్దు

## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్






హైదరాబాద్,అక్టోబర్16 : తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు -మిగతా 2 లో..

# రష్యా నుంచి ఇకపై భారత్ చమురు కొనదు

**మోడీ నాతో చెప్పి.. హామీ కూడా ఇచ్చారు**
**మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**



రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదని.. ఈమేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి రష్యాను ఒంటరిని చేయడంలో ఇదొక కీలక అడుగని అభివర్ణించారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. -మిగతా 4 లో..


06
**పాక్ సొమ్ము కోసం.. భారత్‌పై ట్రంప్ కక్ష**
భారత్‌లో సంబంధాలు దెబ్బతీసుకుంటున్నారు
అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఆరోపణలు



09
**రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం**
మంటల్లో నలుగురు సజీవ దహనం


09
**మమతా బెనర్జీ తల్లి లాంటిది**
అత్యాచార బాధితురాలి తండ్రి కీలక వ్యాఖ్యలు


**డిజిటల్ అరెస్ట్ పేరిట.. ఏకంగా రూ.58 కోట్ల సైబర్ మోసం**

# చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టొద్దు



**వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా?**
**చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే నేరం**
**ఇలాంటి వాటిని తొలగించండి... భవిష్యత్తులో పెట్టకండి**
**లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని సిపి వీసీ సజ్జనార్ హెచ్చరిక**

హైదరాబాద్, అక్టోబర్ 16 : "వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా?" అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యూట్యూబర్లను ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ వీడియోల్లో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ -మిగతా 2 లో..



# డిసెంబరు 1 నుంచి 9వరకు ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాలు

హైదరాబాద్: డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి సమావేశంలో నిర్ణయించారు. -మిగతా 3లో..



# ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170మంది మావోలు

**మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు**
**లొంగిన వారిలో వాసుదేవరావు తదితరులు**
**ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ, అక్టోబర్ 16 : మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావో యిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి -మిగతా 2 లో..

# బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట

మొదటి పేజీ తరువాయి



అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణను మెరిట్స్ ఆధారంగా కొనసాగించాలని హైకోర్టును ఆదేశించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని తెలిపింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 13న పిటిషన్ దాఖలు చేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా అక్టోబర్ 16, 17 తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ఎదుట మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింగ్ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న అభిప్రాయం సరైంది కాదని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానానికి వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, మూడు నెలలు గడిచినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని సూచించింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.

# ఒకల్ ఫర్ లోకల్

మొదటి పేజీ తరువాయి



అయిన గుజరాత్‌లో తాను జన్మించానని, విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఇవాళ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని తెలిపారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తిమంతమైన నాయకత్వం ఉందని, ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతుతో ఉందన్నారు. 16 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రం అపూర్వ ప్రగతి సాధిస్తోందని వివరించారు. దిల్లీ, అమరావతి వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నాయన్నారు. 2047 నాటికి మన దేశం వికసిత్ భారత్‌గా మారుతుందన్నారు. 21వ శతాబ్దం 140 కోట్ల భారతీయుల శతాబ్దమని చెప్పారు. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుందన్నారు. పరిశ్రమలకు ఊతం, జీవన ప్రమాణాల మెరుగుదల వీటి ఫలితమన్నారు. ఏ దేశమైనా లేదా రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకమన్నారు. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశం ఇంధన సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా సబ్ సీ గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ మారుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు విశాఖను ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా మార్చుతుందన్నారు. దీని ద్వారా భారత్‌తో పాటు యావత్ ప్రపంచానికి సేవలు అందుతాయన్నారు. భారత్ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఎంతో అవసరం. అలాగే ఏపీ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి కూడా అంతే అవసరం అన్నారు. ఈ ప్రాజెక్టులు రాయలసీమలోని ప్రతి జిల్లాలో ఉద్యోగాలు సృష్టిస్తాయని, ప్రగతికి కొత్త ద్వారాలు తెరుస్తాయని వివరించారు. పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి అవకాశాలు పెరిగాయని, భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలకంగా మారుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉందన్నారు. ఎన్డీఏ హయాంలో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారుతోందన్నారు. ప్రాజెక్టుల వల్ల కనెక్టివిటీ బలోపేతమవుతుందని, పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయని మళ్లీ స్పష్టం చేశారు. ఇంధన భద్రత గురించి మరొకసారి ప్రస్తావిస్తూ, ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు విశాఖను ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా మార్చుతాయని, వాటివల్ల యావత్ ప్రపంచానికి సేవలు అందుతాయని వివరించారు. ఏపీ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి కీలకం అన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఉద్యోగావకాశాలను కల్పించేలా పలు ప్రాజెక్టులు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' సభా వేదికగా వర్చువల్ ద్వారా వివిధ ప్రాజెక్టులను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానంలో రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. వాటిలో రూ.9,449 కోట్ల విలువైన 5 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయగా, రూ.1,704 కోట్ల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.2,276 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అభివృద్ధి అవసరమన్నారు. సబ్బవరం %-% షీలానగర్ హైవేతో కనెక్టివిటీ పెరుగుతుందని వివరించారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ల ద్వారా ఉపాధి లభిస్తోంది. ప్రజలే ప్రాధాన్యం అని, అభివృద్ధే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. జీఎస్టీ భారాన్ని తగ్గించామని, జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగలా నిర్వహించామని అన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరగడం ఆనందాన్నిచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయని, దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉందని అన్నారు. కానీ, ఏపీ మాత్రం సొంత అభివృద్ధి కోసం పోరాడే పరిస్థితిలో ఉందన్నారు. ఎన్డీఏ హయాంలో ఏపీ ముఖచిత్రం మారుతోందని తెలిపారు. నిమ్మలూరు నైట్ విజన్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించబోతుందన్నారు. కర్నూలును డ్రోన్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వం సంకల్పమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.




## వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా?

మొదటి పేజీ తరువాయి

సభ్య సమాజానికి ఏమో సందేశం ఇచ్చుకుంటున్నారు అని నిలదీశారు. చిన్నారులు, యువతకు స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తుల్ని ఇంటర్వ్యూలు చేసి సమాజ అభివృద్ధికి దోహదం చేయాలని సూచించారు. అంతేకాదు, ఇలాంటి వీడియోలు చేయించి పిల్లలను తప్పుదారికి దారితీసే పనిలోకి లాగకూడదని చెప్పారు. గుర్తు పెట్టుకోండి ు ఇది బాల హక్కుల ఉల్లంఘనే కాక చట్టపరంగా నేరం కూడా అవుతుందని హెచ్చరించారు. ఇటువంటి చర్యలు పోక్సో, జువెనైల్ జస్టిస్ చట్టాల్ని ఉల్లంఘించడం కావడమని పేర్కొన్నారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందకి వస్తుందని, మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపై పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరించినట్లు చెప్పారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకురాబోతున్నామని, తక్షణమే ఈ విషయాలను తొలగించకుంటే భవిష్యత్తులో కూడా ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ వీడియోల్లో ఇలాంటి విషయాలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్ట్ చేయండని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కూడా ఫిర్యాదు చేయవచ్చని, అలాగే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడమే కాదు ు వారి బాల్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడటం కూడా మా బాధ్యతనే అని సజ్జనార్ పేర్కొన్నారు.

## లంచం సొమ్ముతో సినిమాల్లో పెట్టుబడులు

### మాజీ అధికారి బాగోతమిది..

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో పదవీ విరమణ పొందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆస్తులు చూసి అధికారులు కంగుతిన్నారు. అతడి ఆదాయానికి, సోదాల్లో దొరికిన సంపదకు ఏమాత్రం పొంతనలేదని గుర్తించారు. కిలోల కొద్దీ బంగారం, వెండి, నోట్ల కట్టలు, పెట్టుబడుల గురించి తెలుసుకొని ఆశ్చర్యపోయారు. మధ్యప్రదేశ్‌లో ఈ అవినీతి బాగోతం బయటపడింది. లోకాయుక్త పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ధర్మేంద్రసింగ్ భదౌరియా మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ఎక్సైజ్ అధికారిగా పనిచేసి, రిటైర్ అయ్యాడు. అతడి వద్ద ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని మధ్యప్రదేశ్ లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు అందింది. దాంతో ఆ మాజీ అధికారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. గ్వాలియర్, ఇందౌర్‌లో అతడికి చెందిన పలు ప్రాంతాల్లో తనిఖీ చేసినట్లు లోకాయుక్త డీఎస్పీ సునీల్ తలాన్ వెల్లడించారు. రూ.18.59 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులు ఉన్నాయని గుర్తించినట్లు చెప్పారు. పూర్వీకుల ఇల్లుతో పాటు నాలుగు ఫ్లాట్స్, 4,700 చదరపు అడగుల స్థలంలో మూడు అంతస్తుల ఇల్లు ఉన్నట్లు తేలింది. రూ. 4.22 కోట్ల విలువైన బంగారం, రూ.7.13 కోట్ల వెండి కడ్డీలు, ఆభరణాలు, రూ.1.13 కోట్లు, 5వేల యూరోల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఖరీదైన వాహనాలు, ఫర్నీచర్, చీరలు, చేతి గడియారాలు, పర్ఫ్యూమ్‌లు వారు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయి. భదౌరియా కుటుంబం సినిమాల్లో పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం అందిందని తలాన్ వెల్లడించారు. ఆగస్టు 31న ఈ భదౌరియా పదవీవిరమణ చేశాడు. "అతడి 38 ఏళ్ల సర్వీసులో రెండుకోట్ల రూపాయల జీతం, భత్యం రూపంలో అందుకోవడానికి వీలు ఉంది. అతడి చట్టబద్ధ ఆదాయంతో పోలిస్తే తనిఖీల్లో బయటపడిన ఆస్తుల విలువకు పొంతన లేదు" అని పోలీసు అధికారి పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. కొన్నిరోజుల క్రితం కూడా ఇలాగే ఓ విశ్రాంత ఉద్యోగి బాగోతం బయటపడిన సంగతి తెలిసిందే. భోపాల్‌లో ప్రజా పనుల విభాగంలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసి, రిటైర్ అయిన జీపీ మెహ్రా లగ్జరీ లైఫ్‌స్టైల్ వార్తల్లో నిలిచింది. ఓ అప్రకటిత ఆస్తుల వ్యవహారంలో తీగ లాగితే.. నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, వెండి లభించాయి. ఇక అతడి ఫామ్‌హౌస్‌లో దొరికిన 17 టన్నుల తేనెను చూసి వారు ఆశ్చర్యపోయారు. నర్మదాపురంలో మెహ్రాకు చెందిన ఫామ్‌హౌస్‌లో 32 అధునాతన కాటేజీలు నిర్మాణదశలో ఉన్నాయి. 17 టన్నుల తేనె లభించింది. మెహ్రా సంపద రూ.వందల కోట్లలో ఉండొచ్చని అప్పుడు లోకాయుక్త అధికారులు వెల్లడించారు.



## నాలుగో భార్యకు ప్రతినెలా భరణం ఇవ్వండి

### ఎంపీకి హైకోర్టు ఆదేశం

**అలహాబాద్ :** మీ నాలుగో భార్యకు ప్రతినెలా రూ.30వేలు చెల్లించండి అంటూ అలహాబాద్ హైకోర్టు సమాజ్ వాద్ పార్టీ ఎంపీ మొహిబ్బుల్లా నద్వీని ఆదేశించింది. భరణం క్రమం తప్పకుండా చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అసలేం జరిగిందంటే.. రాంపూర్ ఎంపీ అయిన నద్వీ తన నాలుగో భార్య నుంచి విడిపోయే విషయంపై ఆగ్రాలోని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఎంపీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఇది వైవాహిక వివాదానికి సంబంధించిన విషయమన్నారు. దీనిని సామరస్యంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశం నద్వీకి ఉందంటూ న్యాయస్థానానికి తెలిపారు. దీంతో సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు అవకాశం ఇస్తున్నట్లు జస్టిస్ సుభాష్‌చంద్రశర్మ పేర్కొన్నారు. ఈక్రమంలో సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం ఇచ్చారు. నద్వీ రూ.55వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రతినెలా రూ.30వేలు ఆయన భార్యకు భరణంగా చెల్లించాలని ఆదేశించారు. ఈ చెల్లింపులు చేయడంలో లేదా మధ్యవర్తిత్వం విఫలమైతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

## మీడియా ముందుకెళ్లొద్దు

మొదటి పేజీ తరువాయి

వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.



## గుంటూరులో దారుణం..

### పొట్టిగా ఉన్నాడని పరువు హత్య.. ఏడుగురి అరెస్ట్

**గుంటూరు:** నగరంలోని పొన్నూరు రోడ్డులో ఈ నెల 7న జరిగిన కుర్రా గణేష్ హత్య కేసులో నిందితులను గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసుతో సంబంధం ఉన్న మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అజీజ్ తెలిపారు. గణేష్ హత్యలో నలుగురు వ్యక్తులు పాల్గొనగా.. వీరికి మరో ముగ్గురు ఆశ్రయం కల్పించినట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కీలక ఆధారాలు సేకరించి నిందితులను అరెస్టు చేశామని వెల్లడించిన పోలీసులు.. వివాహం ఇష్టం లేనందునే గణేష్‌ను నిందితుడు దుర్గారావు హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఏడుగురు నిందితులను కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ వెల్లడించారు. బావని సొంత బావమరిదే హత్యచేసిన ఘటన గుంటూరులో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. పెద్దలకు ఇష్టం లేకుండా.. తన సోదరిని ప్రేమ వివాహం చేసుకున్న కుర్రా గణేష్ పొట్టిగా ఉన్నాడని కక్ష పెంచుకున్న అతని బావమరిది దారుణానికి ఒడిగట్టాడు. మరి కొందరితో కలిసి నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కత్తులతో పొడిచి చంపాడు.



## సీనియర్ ఐపీఎస్ ఇంట్లో సీబీఐ సోదాలు

### భారీగా బయటపడ్డ నోట్ల కట్టలు

**చండీగఢ్:** ఫిర్యాదుదారుడి నుంచి లంచం డిమాండ్ చేసిన కేసులో పంజాబ్‌లోని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి ఇంట్లో సీబీఐ అధికారులు సోదాలు జరిపారు. ఈ సోదాల్లో భారీగా నోట్ల కట్టలతో పాటు బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. ప్రస్తుతం రోపర్ రేంజ్ డీఐజీగా పనిచేస్తున్న సదరు అధికారిని ఓ ప్రైవేటు వ్యక్తితో కలిసి లంచం తీసుకున్న కేసులో అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఓ కేసు విషయంలో ఫిర్యాదుదారుడి నుంచి రూ.8లక్షల మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు తెలుసుకున్న సీబీఐ బృందం.. చండీగఢ్‌లోని సెక్టార్ 21లో డీఐజీ తరఫున లంచం తీసుకొంటున్న వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం డీఐజీని అదుపులోకి తీసుకొని చండీగఢ్, పంజాబ్‌లలోని అతడి నివాసాల్లో సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో ఐపీఎస్ అధికారి ఇంట్లో దాదాపు రూ.5కోట్లకు పైగా నగదుతో పాటు కిలోన్నర బంగారు ఆభరణాలు, స్థిర ఆస్తులకు సంబంధించిన పత్రాలు, మెర్సిడెజ్, ఆడి వంటి ఖరీదైన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. 22 లగ్జరీ వాచ్‌లు, లాకర్ తాళాలు, 40 లీటర్ల దిగుమతి చేసిన లిక్కర్ బాటిళ్లు, పలు ఆయుధాలను సైతం సీజ్ చేశారు. ఈ కేసులో అరెస్టయిన ప్రైవేటు వ్యక్తి నుంచి రూ.21 లక్షలు రికవరీ చేశారు. లంచం కేసులో ఇద్దరినీ అరెస్టు చేసిన సీబీఐ అధికారులు.. వీరిద్దరినీ అక్టోబర్ 17న కోర్టులో హాజరుపరచనున్నారు. నిందితుల ఇళ్లలో సోదాలు, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

## ఈపీఎఫ్ కనీస నిల్వ 25 శాతం

- ప్రత్యేక సందర్భాల్లో ఆ మొత్తం కూడా తీసుకోవచ్చు
- సీబీటీ నిర్ణయాలపై స్పష్టతనిచ్చిన ఈపీఎఫ్‌వో

**హైదరాబాద్:** భవిష్యనిధి(ఈపీఎఫ్)లో నెలవారీ జమయ్యే ఉద్యోగి, యజమాని వాటాల్లో 25 శాతం మొత్తాన్ని కనీస నిల్వగా ఈపీఎఫ్‌వో నిర్ణయించింది. ఈ కనీస మొత్తం(25 శాతం) మినహాయించగా.. మిగతా 75 శాతం నుంచి అనుమతించిన క్లెయిమ్‌ల సంఖ్య మేరకు నగదు ఉపసంహరణ చేసుకోవచ్చు. అయితే, ఈ కనీస నిల్వనూ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వెనక్కి తీసుకునే అవకాశముందని ఈపీఎఫ్‌వో వెల్లడించింది. తాజా మార్గదర్శకాల మేరకు రూ.5 లక్షల వరకు క్లెయిమ్‌లు ఆటోమెటిక్‌గా సెటిల్ అవుతాయని పేర్కొంది. సీబీటీ ఆమోదించిన కొత్త నిబంధనలతో పదవీ విరమణ సమయంలో మెరుగైన నగదు నిల్వతోపాటు వ్యక్తిగత, కుటుంబానికి ఆర్థిక రక్షణ లభిస్తుందని ఈపీఎఫ్‌వో తెలిపింది.




### ఈపీఎఫ్‌వో స్పష్టత ఇచ్చిన వివరాలివీ..

- చందాదారుడి ఖాతాలో 25 శాతం నిల్వను లాక్‌చేసి, పదవీ విరమణ చేసేవరకూ ఎట్టిపరిస్థితుల్లో ఉపసంహరణకు అనుమతించరన్న అపోహలు ఉద్యోగులు, కార్మికుల్లో నెలకొన్నాయి. వీటిపై ఈపీఎఫ్‌వో స్పష్టతనిచ్చింది. 55 ఏళ్ల వయసు అనంతరం పదవీ విరమణ చేసినా, పాక్షిక వైకల్యంతో పదవీ విరమణ చేసినా, స్వచ్ఛంద పదవీ విరమణ చేసినా, పూర్తిగా దేశాన్ని విడిచివెళ్లినా.. తదితర సందర్భాల్లో కనీస నిల్వ 25 శాతంతో కలిపి నూరు శాతం ఉపసంహరణకు అవకాశముందని ఈపీఎఫ్‌వో తెలిపింది.
- ఉద్యోగం మానేసిన వెంటనే నగదు నిల్వ నుంచి 75 శాతం వెనక్కి తీసుకోవచ్చు. అయితే, ఆ తర్వాత 12 నెలలపాటు నిరుద్యోగిగా ఉంటే.. కనీస నిల్వ 25 శాతాన్ని కూడా తీసుకునేందుకు ఈపీఎఫ్‌వో అనుమతిస్తుంది.
- గతంలో 13 రకాలైన కేటగిరీలు, వేర్వేరు నిబంధనలు, పరిమితులు ఉండటంతో చందాదారుడి ఖాతాలోని నగదు సులువుగా తీసుకునేందుకు అవకాశం ఉండేది కాదు. తాజాగా ఈ కేటగిరీలను మూడు గ్రూపుల కింద విభజించడంతో ఎలాంటి పత్రాలు అవసరం లేకుండా నగదు తీసుకునేందుకు వెసులుబాటు లభిస్తోంది.
- గతంలో వివాహం, ఇంటి నిర్మాణం కోసం నగదు తీసుకునేందుకు కనీసం 5–7 ఏళ్ల సర్వీసు పూర్తిచేసినవారికే అవకాశం ఉండేది. కొత్త నిబంధనల కింద ఏడాది సర్వీసు అనంతరం ఈ కేటగిరీల్లో నగదు తీసుకోవచ్చు.
- విద్య, అనారోగ్యం కేటగిరీల కింద ఉపసంహరణలు మరింత సులభతరం. వీటితోపాటు ప్రత్యేక పరిస్థితుల్లో ఏడాదికి రెండుసార్లు ఎలాంటి పత్రాలు లేకుండా అర్హత కలిగిన నిల్వను పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు.

## విపక్ష కూటమిలో సీట్ల పంచాయితీ..

### లాలూకు రాహుల్ గాంధీ ఫోన్

**బిహార్ :** బిహార్‌లో తొలి దశ ఎన్నికలకు నామినేషన్ల గడువు దగ్గర పడుతున్నప్పటికీ ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్‌లోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలు ఫోన్‌లో సంప్రదింపులు మొదలుపెట్టినట్లు తెలిసింది. సీట్ల సర్దుబాటుపై చర్చించినట్లు సమాచారం. సీట్ల పంపకాల్లో ముందున్న ఎన్డీయే కూటమి పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. అయినప్పటికీ విపక్ష ఇండియా కూటమిలో పార్టీలు మాత్రం సీట్లపై ఏకాభిప్రాయానికి రావడం లేదు. కాంగ్రెస్‌కు దాదాపు 50 సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ మాత్రం కనీసం 60 స్థానాలు కేటాయించాలని పట్టుపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తమ పార్టీకి పట్టున్న స్థానాలను వదులుకునేందుకు ఆర్జేడీ సిద్ధంగా లేకపోవడంతో సీట్ల కేటాయింపు విషయం కొలిక్కి రావడం లేదని తెలుస్తోంది. దీనిపై రాష్ట్రస్థాయిలో ఇరు పార్టీల నేతలు జరిపిన చర్చలు సఫలీకృతం కాకపోవడంతో రంగంలోకి దిగిన కాంగ్రెస్ అగ్రనేతలు లాలూతో చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# బీసీ రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

- న్యాయనిపుణులతో చర్చించి ముందుకు
- స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత
- కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు
- మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో కేబినేట్ సబ్‌కమిటీ
- డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు
- తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయాలు.. హాజరు కాని కొండా సురేఖ



**హైదరాబాద్, అక్టోబర్ 16 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్‌లో చర్చించారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయ వాదులు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం రేవత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్లాలని కేబినేట్‌లో నిర్ణయించారు. ఇకపోతే స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీచేయకుండా తీసుకున్న నిర్ణయాన్ని ఎత్తివేస్తూ కేబినేట్ ఆమోదించింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినేట్‌లోకీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నందున డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, రైతు భరోసా, మైనింగ్ కొత్త పాలసీ, మెట్రో ఫేజ్–2 టెండర్లపై చర్చించారు. మెట్రో ఫేజ్–2పై సమావేశంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సిఎస్ అధ్యక్షతన కేబినేట్ సబ్‌కమిటీ వేశారు. అయితే, కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తన ఇంటికి పోలీసులు రావడంపై ఆగ్రహంగా ఉన్నారు మంత్రి కొండా సురేఖ. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాకూడదని మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, జయశంకర్ వర్సిటీకి మూడు కొత్త వ్యవసాయ కళాశాలలకు కేబినేట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే,ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.10,500 కోట్లతో నిర్మించే 5500 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదించింది. త్వరలో టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పలు రంగాలకు భూ కేటాయింపులు జరిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామన్నారు. వరి రికార్డు స్థాయిలో పండిందని, దానిని పూర్తిగా కొనుగోలు చేస్తామని అన్నారు. 'రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్‌లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానించింది. నల్సార్ వర్సిటీకి గతంలో ఇచ్చిన దానికంటే అదనంగా 7 ఎకరాలు ఇస్తాం. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించాం. కేంద్రం కొనుగోలు చేసినా.. చేయకపోయినా మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మెట్రో రెండో దశను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సీఎస్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.



## జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

### ఇప్పుడు ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు

**హైదరాబాద్, అక్టోబరు 16 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటు చోరీపై హైకోర్టులో బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌తో సంబంధంలేని వారు ఓటరు జాబితాలో చేరారని తెలిపారు. బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించామని వాదనలు వినిపించారు. ఈసీ తరపు లాయర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రిప్రజెంటేషన్లపై ఎన్నికల అధికారిని ఆదేశించామని.. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

## నా సమస్య పరిష్కరిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు : మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్:** తాజా పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చర్చించారు. గత కొన్ని రోజులుగా తనకు సంబంధించి చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరించారు. నిన్న రాత్రి తన ఇంటి వద్దకు పోలీసులు వచ్చిన సమయంలో చోటు చేసుకున్న డ్రామాను వారికి వివరించారు. భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. " నా సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సెటిల్ చేస్తామని పార్టీ పెద్దలు చెప్పారు. మిగిలిన విషయాలు వారే చూసుకుంటారని భరోసాతో వెళ్తున్నా" అని మంత్రి సురేఖ తెలిపారు. గత కొన్ని రోజులుగా తనను, తన కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని ఇబ్బంది పెడుతున్నారని నేతల వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. డెక్కన్ సిమెంట్ యాజమాన్యం వ్యవహారంలో జరిగిన పరిణామాలు, వారితో జరిగిన చర్చలు, ఆ సంస్థ అక్రమాలు తదితర విషయాలన్నీ వివరించినట్లు తెలుస్తోంది.

## అన్నపై కత్తితో తమ్ముడి దాడి

### అడ్డొచ్చిన వదిన తీవ్రగాయాలతో మృతి

**వరంగల్, అక్టోబర్ 16 :** వరంగల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అన్నపై తమ్ముడు దాడి చేయగా.. అడ్డొచ్చిన వదిన తీవ్రగాయాలతో మృతిచెందారు. నల్లబెల్లి మండలం కొండాపురంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అన్న మేరుగుర్తి రమేశ్‌పై తమ్ముడు సురేశ్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో వదిన స్వరూప(30) అడ్డు వచ్చింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వరూప మృతిచెందారు. గాయాలతో ఆస్పత్రిలో రమేశ్ చికిత్స పొందుతున్నాడు. అన్నదమ్ముల మధ్య డబ్బు వివాదమే ఈ ఘటనకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

## ఎయిరిండియా ప్రమాద ఘటన

### సుప్రీం కోర్టును ఆశ్రయించిన పైలట్ తండ్రి



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 260 మంది మృతి చెందారు. ప్రధాన పైలట్ కెప్టెన్ సుమీత్ సభర్వాల్, కో–పైలట్ క్లైవ్ కుందర్ కూడా మరణించిన వారిలో ఉన్నారు. తాజాగా ఈ కేసులో న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. భారత పైలట్ల సమాఖ్య సైతం ఈమేరకు పిటిషన్ దాఖలు చేసింది. ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని పిటిషనర్లు విమర్శించారు. దర్యాప్తు బృందం ప్రధానంగా పైలట్లపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. ఈ విషాదానికి దారితీసిన సాంకేతిక, విధానపరమైన అంశాలను పరిశీలించడంలో విఫలమైందన్నారు. "నివేదికలోని ఎంపిక చేసిన భాగాలను బహిర్గతం చేయడం ద్వారా వాస్తవాలను తప్పుదోవ పట్టించడం.. ముఖ్యంగా పైలట్లను లక్ష్యంగా చేసుకోవడం వంటివి అసలైన కారణాలను గుర్తించడాన్ని కష్టతరం చేస్తాయి" అని పిటిషనర్లు పేర్కొన్నారు. 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' నియంత్రణలోని దర్యాప్తు బృందం కూర్పునూ ప్రశ్నించారు. ఇందులో డీజీసీఏ, విమానయాన అధికారులే ఉన్నారని చెప్పారు. ఏ వ్యక్తి కూడా తన సొంత కేసులో న్యాయమూర్తిగా ఉండకూడదనే సహజ న్యాయ సూత్రాన్ని ఇది ఉల్లంఘిస్తోందన్నారు. పైలట్‌గా సభర్వాల్‌కు విస్తృత అనుభవం ఉందని, 30 ఏళ్ల కెరీర్‌లో ఒక్క మచ్చ కూడా లేదని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వంలో.. స్వతంత్ర నిపుణుల కమిటీతో న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై ఏఏఐబీ జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. ఇదికాస్త పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. పైలట్లపై నిందలు దురదృష్టకరమని సుప్రీంకోర్టు సైతం వ్యాఖ్యానించింది.



## ట్రంప్-మోదీల మధ్య సంభాషణ జరగలేదు

### విదేశాంగశాఖ

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు ప్రధాని మోదీ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై భారత్ స్పందించింది. ట్రంప్–మోదీల మధ్య నిన్న అటువంటి సంభాషణ ఏదీ జరగలేదని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ దీనిపై భారత్ ఇప్పటికే స్పష్టతనిచ్చిందన్నారు. వైట్‌హౌస్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ట్రంప్.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మోదీతో తాను మాట్లాడానని, మాస్కో నుంచి చమురు కొనుగోలు నిలిపివేస్తానని భారత ప్రధాని తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతేకాదు.. ఉక్రెయిన్ యుద్ధంలో మాస్కోను ఒంటరి చేసే ప్రయత్నాల్లో ఇదో కీలక అడుగు అన్నారు. ఈ విషయంపై భారత విదేశాంగశాఖ గురువారం ఉదయం స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇంధన విషయంలో దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ముఖ్యమని పేర్కొంది. వీటి ఆధారంగానే తమ దిగుమతి విధానాలు ఉంటాయని స్పష్టం చేసింది. అమెరికా విషయానికొస్తే.. చమురు దిగుమతి పెంచడానికి ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నామని, గత దశాబ్దం కాలంలో చాలా పురోగతి కనిపించిందని తెలిపింది.

**పాక్‌కు అలవాటే..**

అఫ్గాన్–పాకిస్థాన్ మధ్య జరుగుతోన్న ఘర్షణలపైనా భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఉగ్ర సంస్థలకు పాక్ కేంద్రంగా మారిందని, వాటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టింది. అంతర్గత వైఫల్యాలకు పొరుగు వారిని నిందించడం పాక్‌కు అలవాటేనని స్పష్టం చేసింది. అఫ్గాన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వానికి భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపింది. ఆ రెండు దేశాల మధ్య ఘర్షణల నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది.



## సురేఖ ఓఎస్డీ గురించి తెలియదు

- తన కుమార్తె ఏం మాట్లాడిందో కూడా తెలియదు
- కాంగ్రెస్ నేత కొండా మురళి

**హనుమకొండ, అక్టోబర్ 16 :** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని చెప్పారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం తదితర పరిణామాల నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉన్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్తాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారని కొండా మురళి వ్యాఖ్యానించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

### సీపీఎం మద్దతు కోరిన కాంగ్రెస్

**హైదరాబాద్, అక్టోబర్ 16 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసి రావాలని సీపీఐ(ఎం)ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆయన భేటీ అయ్యారు. పార్టీ నగర కమిటీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. దీనిపై మహేశ్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

## రైలులో ప్రయాణికురాలిపై అత్యాచారం..

### నిందితుడిని పట్టుకున్న రైల్వే పోలీసులు

**గుంటూరు:** ప్రయాణికురాలిపై అత్యాచారం చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు గుర్తించారు. రెండు రోజుల క్రితం గుంటూరు స్టేషన్‌కు చేరుకున్న సంత్రగాచి స్పెషల్ రైలులోని మహిళా బోగీలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల సాయంతో నిందితుడిని గుర్తించారు. తెనాలి స్టేషన్‌లో గుంటూరు రైల్వే పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఏపీకి చెందిన ఓ మహిళ(35) సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సంత్రగాచి స్పెషల్ రైలు మహిళా బోగీలో ఎక్కారు. చర్లపల్లి స్టేషన్‌లో దిగిన అనంతరం ఎక్కడైనా ఇళ్లలో పని చూసుకోవాలనుకున్నారు. రైలు గుంటూరు స్టేషన్‌కు చేరుకున్న సమయంలో బోగీలో ఉన్న మిగిలిన ప్రయాణికులు దిగిపోగా ఆమె ఒక్కరే మిగిలారు. అదే సమయంలో దాదాపు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి ఇది మహిళా బోగీ అని వారిస్తున్నా, ప్రాధేయపడి లోపలికొచ్చాడు. కొద్దిసేపటికే తలుపు మూసివేశాడు. రైలు గుంటూరు స్టేషన్ నుంచి బయలుదేరిన 20 నిమిషాల తరువాత ఆ వ్యక్తి కత్తితో బెదిరించి ఆమె వద్ద ఉన్న రూ.5,600, సెల్‌ఫోన్, హ్యాండ్‌బ్యాగును లాక్కొని దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం రైలు పెదకూరపాడు స్టేషన్‌కు చేరుకుంటుండగా కిందకి దిగి పారిపోయాడు. మంగళవారం రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకున్న అనంతరం బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు.



## వెంకటేశ్, రానా కోర్టుకు రావాల్సిందే

### నాంపల్లి కోర్టు

**హైదరాబాద్, అక్టోబర్ 16 :** ఫిల్మ్‌నగర్ దక్కన్ కిచెన్ హెూటల్ కూల్చివేత కేసుపై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్, సురేశ్ బాబు నవంబర్ 14న తప్పనిసరిగా న్యాయస్థానానికి రావాలని ఆదేశించింది. పర్సనల్ బాండ్ సమర్పించేందుకు కచ్చితంగా రావాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హెూటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో సినీనటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్‌తో పాటు నిర్మాత దగ్గుబాటి సురేశ్‌పై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే.



## ధాన్యం రైతులను ఇబ్బంది పెట్టవద్దు

### ఐకెపి కేంద్ర సిబ్బందికి కడియం హెచ్చరిక

**జనగామ, అక్టోబర్ 16 :** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులను.. కేంద్ర నిర్వాహకులు ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో వారికి సహాయంగా ఉండి తగిన విధంగా చేయూత ఇవ్వాలన్నారు. నమిలిగొండలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్య ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం– రైతు ప్రభుత్వమని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ఏడాది నుంచి ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా అందించడానికి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ధాన్యం కొనుగోలు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వడం, పూర్తి ధాన్యం కొనడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు.

# రష్యా నుంచి ఇకపై భారత్ చమురు కొనదు



- మోడీ నాతో చెప్పి.. హామీ కూడా ఇచ్చారు
- మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్, అక్టోబర్ 16 :** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదని.. ఈమేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి రష్యాను ఒంటరిని చేయడంలో ఇదొక కీలక అడుగని అభివర్ణించారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. రష్యా నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోవడంపై ప్రధాని మోదీ వద్ద తాను ఆందోళన వ్యక్తం చేశానని ట్రంప్ చెప్పారు. మాస్కో నుంచి భారత్ చమురు కొనడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు పుతిన్ ఆ నిధులు ఉపయోగిస్తున్నారని అమెరికా భావిస్తున్నదని తెలిపారు. ఈ కొనుగోళ్లపై తాను సంతోషంగా లేనని చెప్పాను. ఈ సందర్భంగా ఇక నుంచి రష్యా నుంచి చమురు కొనుగోలు చేయమని ప్రధాని మోదీ ఈరోజు తనకు హామీ ఇచ్చారని. ఇదొక కీలక ముందడుగు అని చెప్పారు. చైనా కూడా రష్యా ఆయిల్‌ను కొనకుండా చేస్తానని, ఇక అదే మిగిలి ఉందని తెలిపారు. భారత్, చైనా.. అమెరికాతో కలిసి వస్తే పుతిన్ చేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన విధానంపై భారత్, అమెరికాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ యూఎస్‌కు భారత్ సన్నిహిత భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనకు స్నేహితుడని, తమ మధ్య గొప్ప అనుబంధం ఉందని చెప్పొకొచ్చారు. నేను చాలా ఏండ్లుగా భారత్‌ను గమనిస్తున్నానని, అది అద్భుతమైన దేశమని చెప్పారు. గతంలో ప్రతి ఏడాది కొత్త నాయకుడు వచ్చేవారు. కొందరు కొన్ని నెలలకే మారిపోయేవారన్నారు. కానీ ఇప్పుడు తన మిత్రుడు చాలా కాలంగా అక్కడ అధికారంలో కొనసాగుతున్నారని వెల్లడించారు. మోదీ నాయకత్వంలో రాజకీయంగా స్థిరత్వం సాధించిందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. 'గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

## భారత ఆర్థిక వ్యవస్థకు మా చమురు కీలకం : రష్యా

ట్రంప్ వ్యాఖ్యలపై రష్యా కూడా స్పందించింది. తమ చమురు దిగుమతులు భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమని ఇక్కడి రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, అది నమ్మకం అనే దృఢమైన పునాదిపై ఆధారపడి ఉందని వ్యాఖ్యానించారు. తాము భారత ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని ముందుకుసాగుతున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్- అమెరికా సంబంధాల్లో తాము ఎలాంటి జోక్యం చేసుకోమన్నారు. ఈ క్రమంలో భారత్‌తో తమ దీర్ఘకాల సంబంధాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారు

- పదేపదే ప్రశంసలే ఇందుకు నిదర్శనం
- ఎక్స్ వేదికగా విపక్షనేత రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 16 :** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఇకపై ఆపేస్తామని ప్రధాని నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వాటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారని ఎద్దేవా చేశారు. ఈసందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు.

- రష్యా చమురు భారత్ కొనుగోలు చేయదని ట్రంప్ నిర్ణయించుకొని ప్రకటించడానికి అనుమతి ఇస్తున్నాం.
- పదేపదే తిరస్కరణలు ఎదురైనా అభినందన సందేశాలు పంపుతున్నాం.
- ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నాం.
- ఈజిప్టులోని షర్మ్-ఎల్ షేక్‌లో సోమవారం గాజా శాంతి ఒప్పందం జరిగింది. ఆ కార్యక్రమానికి ప్రధాని హాజరుకాలేదు.
- ఆపరేషన్ సిందూర్ గురించి ట్రంప్ పదేపదే చేస్తోన్న ప్రకటనలను విభేదించడం లేదు" అని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

అమెరికా నుంచి చమురు కొనుగోలుకు భారత్ సిద్ధంగానే ఉందని వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించిన విషయం తెలిసిందే. కానీ సరైన ధర లభిస్తేనే ఈ అంశాన్ని ఆలోచిస్తామని పేర్కొన్నారు. గతంలో అమెరికా నుంచి భారత్ 22-23 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం కొనుగోలు చేసేదని, ఇంకా అమెరికా నుంచి సుమారు 12-13 బిలియన్ డాలర్ల వరకు విలువైన ఇంధనం కొనుగోళ్లను పెంచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు నడుస్తోన్న సమయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ నుంచి ప్రకటన వచ్చింది. వైట్‌హౌస్‌లో రిపోర్టర్లతో అమెరికా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోవడంపై తాను భారత ప్రధాని మోదీ వద్ద ఆందోళన వ్యక్తం చేశానన్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనడం వల్ల పుతిన్ యుద్ధం కొనసాగించేందుకు ఈ నిధులు ఉపయోగపడుతున్నాయని అమెరికా భావిస్తోందన్నారు. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఆపేయనున్నట్లు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదొక కీలక ముందడుగు అని వెల్లడించారు. చైనా సైతం రష్యా ఆయిల్‌ను కొనకుండా చేస్తానని ఇక అదే మిగిలిఉందన్నారు. ఇంధన విధానంపై భారత్, అమెరికాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ యూఎస్‌కు భారత్ సన్నిహిత భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

## కులగణన సర్వేకు నారాయణమూర్తి దంపతులు దూరం

### ఎలాంటి సర్వేతో తమవద్దకు రావద్దని తెలిపినట్లు సమాచారం



**బెంగళూరు, అక్టోబర్ 16 :** కర్ణాటక ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వేకు దూరంగా ఉండాలని, అందులో తాము పాల్గొనబోమని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు స్పష్టం చేసినట్లు సమాచారం. సర్వేలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. అయితే, ఈ సర్వే లో తాము పాల్గొనబోమని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి దంపతులు చెప్పినట్లు తెలుస్తోంది. తాము వెనకబడిన వర్గానికి చెందిన వ్యక్తులం కాదని వారు అధికారులతో తెలిపినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. సామాజిక, ఆర్థిక గణనలో భాగంగా బెంగళూరులోని జయానగర్‌లోని నారాయణమూర్తి నివాసానికి ఇటీవల సిబ్బంది వెళ్లారు. అయితే తమ వివరాలు చెప్పేందుకు నారాయణమూర్తి, ఆయన సతీమణి, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి నిరాకరించినట్లు తెలుస్తోంది. మా నివాసంలో ఎలాంటి సర్వే నిర్వహించొద్దు. మేం వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులం కాదు. అందువల్ల ఈ సర్వేలో పాల్గొనాల్సిన అవసరం లేదని వారు చెప్పారని తెలుస్తోంది. ఇదే విషయాన్ని వారు సర్వే పత్రంపై రాసి సంతకాలు చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. తమ ఇంట్లో ఈ సర్వే చేయడం వల్ల ప్రభుత్వానికి ఏ ఉపయోగం ఉండబోదని పేర్కొంటూ నారాయణమూర్తి దంపతులు స్వీయ ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించినట్లు సమాచారం. కాగా.. ఈ పరిణామాలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. సర్వేలో పాల్గొనాలని తాము ఎవరినీ బలవంతం చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇది పూర్తిగా స్వచ్ఛందంగా చేపడుతున్న గణన అని స్పష్టంచేశారు. సెప్టెంబరు 22 నుంచి రాష్ట్రంలో ఈ సర్వే జరుగుతోంది. దీని కింద రాష్ట్ర జనాభాకు సంబంధించి సామాజిక, ఆర్థిక, విద్య, కుల వివరాలను సేకరించనున్నారు. ఇందుకోసం మొత్తంగా 60 ప్రశ్నలను రూపొందించారు. ఈ గణన కోసం రూ.420కోట్ల వరకు ఖర్చు పెట్టనున్నట్లు అంచనాలున్నాయి. ఈ సర్వేపై కర్ణాటకలో పెద్దఎత్తున వ్యతిరేకతలు వచ్చాయి. హైకోర్టులోనూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని న్యాయస్థానం తోసిపుచ్చింది. సామాజిక, ఆర్థిక సర్వేను అడ్డుకోలేమని చెప్పింది. అయితే, బలవంతంగా వ్యక్తిగత వివరాలు సేకరించరాదని, సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించాలని సూచించింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలోనే నారాయణమూర్తి దంపతులు సర్వేకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# తాయిలాలకు లొంగితే అంతే సంగతులు!



**ఎన్నికల ముందు హామీలు ఇచ్చే వారిని ప్రజలు నమ్మడం మానేస్తే ప్రజాస్వామ్యం బోలపేతం అవుతుంది. అంతెందుకు అసలు నాయకుల హామీలను పట్టించుకోవద్దు. ప్రజలు ఈ విషయంలో చైతన్యం పొందాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీల హామీలను దరిచేరకుండా చూసుకోవాలి. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం కాదు..ప్రజలు తమ ఎజెండాను నాయకుల ముందు ఉంచాలి. గ్రామాల వారీగా ప్రజలే ఎజెండా విధించాలి. రోడ్లు వేస్తారా లేదా అడగాలి. మంచినీటి సరఫరా చేస్తారా లేదా నిలదీయాలి. ఇలాంటి సమస్యల ను ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజలే గుర్తించి నాయకులకు ఎజెండా నిర్దేశించాలి. కిలోరూపాయి బియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి వాటికి లొంగితే అంతే సంగతులు. అలా చేసి అధికారంలోకి వచ్చిన నేతలు రాష్ట్రాలను లూటీ చేసేస్తున్నారు.అందుకు తెలుగు రాష్ట్రాలు పక్కా ఉదాహరణ అని చెప్పవచ్చు.**

బీహార్‌లో పదేళ్లుగా అటుఇటుగా ఎన్‌డిఎ ప్రభుత్వమే నడుస్తోంది. నితీశ్ కుమార్ సిఎంగా పెద్దగా మార్పులకు శ్రీకారం చుట్టింది లేదు. అంతుకుముందు లాలూ ప్రసాద్ యాదవ్ కూడా కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. లాలూ లేదా, నితీశ్ కుమార్‌లు పెద్దగా బీహార్‌లో ప్రభావితం చేసేంతగా పాలన సాగించలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. బీహార్ ఓ రకంగా కళింగ రాజ్యంగా చెప్పుకోవాలి. పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని మౌర్యులు పాలించారు. ఆర్య చాణక్యుడు అక్కడే ఉండేవారు. నలంద విశ్వవిద్యా లంయం ఒకప్పుడు ప్రపంచానికి మార్గం చూపింది. ఇలాంటి నేల బీహార్‌లో ఇప్పుడు అరాచకం సాగుతోంది. ఇకపోతే రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నేల అది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. బీహార్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని స్థాపించి దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. మరోమారు ఎన్‌డిఎ అధికారం కోసం ఎత్తులు వేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్థకంగా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. అయితే బంగ్లా చొరబాటు దారుల సమస్య కూడా తీవ్రంగా ఉంది.

ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇకపోతే ఓట్ల తొలగింపు ఆరోపణలు చేస్తున్న రాహుల్ సక్రమంగా రుజువు చేయలేక పోయారు. సుప్రీం కూడా తొలగించిన ఓట్లకు సంబంధించి రుజువులతో అఫిడవిట్ వేయాలని సూచించినా వెనక్కి పోయింది. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధికత్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! అయితే అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు విన్యాసాలు చేస్తున్నాయి. తాజాగా 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఈ క్రమంలో బీహార్ అభివృద్ధికి ఏం చేస్తారన్న దానిపై రాజకీయ పార్టీల్లో స్పష్టత లేదు. కేవలం ఓట్లు కొల్లగొట్టి అధికారం దక్కించుకోవడం అందరిపనిగా మారింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేతల కుయుక్తులను గమనించాలి. తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి. తాయిలాలు ఆశపడితే మరో ఐదేళ్లు లొంగిపోవాల్సి ఉంటుందని గుర్తించాలి.



## ఈసారి గోవా తీరంలో మోదీ దీపావళి వేడుకలు!

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏటా దీపావళి వేడుకలను సరిహద్దుల్లో గస్తీ కాసే జవాన్లతో కలిసి చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించనున్నారు. ఈ ఏడాది గోవా తీరంలోని నౌకాదళ సిబ్బందితో దీపావళి వేడుకలు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సాధించిన విజయాన్ని నౌకాదళ సిబ్బందితో కలిసి ప్రధాని సెలబ్రేట్ చేసుకోనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి మోదీ ఏటా సరిహద్దుల్లో సైనికులతో కలిసి దీపావళి వేడుకలు చేసుకుంటున్నారు. సైనిక దుస్తులు ధరించి.. దళాలతో ముచ్చటించి.. వారికి స్వీట్లు తినిపించి సరదాగా గడుపుతూ వారిలో స్ఫూర్తిని నింపుతున్నారు. 2014లో మోదీ తొలిసారి సియాచిన్‌లో సైనికులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. 2018లో దీపావళి రోజున ఉత్తరాఖండ్‌లోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులతో ముచ్చటించారు. 2022లో కార్గిల్‌లో, 2023లో చైనా సరిహద్దులోని లేప్చా (హిమాచల్ ప్రదేశ్) సైనిక శిబిరంలో వేడుకలు చేసుకున్నారు. ఇక, గతేడాది కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం, ఆర్మీ, నేవీ, వాయుసేన సిబ్బందిని కలిసి వారితో వేడుకలు చేసుకున్నారు.

## స్వీట్ షాపులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

### దీపావళి కోసం నాసిరకం స్వీట్లు గుర్తింపు

**హైదరాబాద్, అక్టోబర్ 16 :** దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో స్వీట్ షాపులపై జీహెచ్‌ఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని 43 స్వీట్ షాప్స్ లో 3 రోజుల పాటు అధికారులు ఫుడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గడువు ముగిసిన పదార్థాలు స్వీట్ల తయారీలో వాడుతున్నట్లు గుర్తించారు. స్వీట్ షాప్ లో అమ్మే వస్తువులకు ఎలాంటి లేబెల్, ఎక్స్ పైరీ డేట్ లేదని అధికారులు తెలిపారు. మిఠాయిలల్లో ప్రమాదకరమైన సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు నిర్ధారించారు. వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. దీపావళి గిరాకీ ఎక్కువగా వస్తుందని నాసిరకంగా టన్నుల కొద్దీ స్వీట్స్ తయారు చేస్తుండటంతో ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉందని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు హెచ్చరించారు. నిబంధనలు పాటించని స్వీట్ షాప్స్ కి నోటీసులు, భారీ పెనాల్టీలు విధించినట్లు తెలిపారు.





## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్ :** ఆత్మకూర్(ఎం) పల్లెర్ల గ్రామంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ కార్యక్రమం పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం పల్లెర్ల లింగరాజుపల్లి గ్రామాలల్లో పాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తడిసిన ప్రతీ గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది రైతులు ఎవరు అధైర్య పడొద్దు అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఎంఆర్వో లావణ్య, ఎంపీడీఓ రాములు మాజీ జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా,మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల వెంకటేశం, డైరెక్టర్స్,నర్సింహా, వినోద,పాక్స్ చైర్మన్ శేఖర్ రెడ్డి, డైరెక్టర్ నర్సింహా కమిటీ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి,పల్లెర్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లారెడ్డి మాజీ వార్డు మెంబర్లు యూత్ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** ఆత్మకూర్(ఎం) అంగన్వాడి సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లల తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, సీపీడీఓ జోష్నా,ఎంఆర్వో లావణ్య, ఎంపీడీఓ రాములు మాజీ జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా,,మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల వెంకటేశం, డైరెక్టర్స్,నర్సింహా, వినోద, పాక్స్ డైరెక్టర్ నర్సింహా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి మాజీ సర్పంచ్ నగేష్ మాజీ వార్డు మెంబర్లు అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి, సమస్యలు పరిష్కరిస్తాం

### మున్సిపల్ కమిషనర్ యోగేష్, విద్యుత్ ఎఈ ప్రదీప్ కుమార్

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపాలిటీ, క్రిస్టల్ టౌన్షిప్ కాలనీలోని సమస్యల గురించి మున్సిపల్ కమిషనర్ ను కలిసి కాలనీవాసులు వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. కాలనీలో మురుగునీటి పారుదల సమస్య ఉన్నందున పాత డ్రైనేజీ పైప్ లైన్ తొలగించి, వాటి స్థానంలో కొత్తగా పెద్ద సైజ్ సిమెంట్ పైప్ లైన్ వేయాలని, కాలనీలో గుంతల మయమైన పాత సిసి రోడ్ల, మట్టి రోడ్లలో కొత్తగా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని, కాలిపోయిన వీధి దీపాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, రోడ్లకు ఇరువైపులా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించుటకు గడ్డి మందు పిచికారి చేయాలని, అదేవిధంగా కాలనీలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కల బెడద నివారించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కమిషనర్ సమస్యలను సవినయంగా విని సానుకూలంగా స్పందించి, తమ సిబ్బందితో కాలనీని సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలపడం జరిగింది. అనంతరం కాలనీవాసులందరూ స్థానిక విద్యుత్ ఎ ఈ ప్రదీప్ కుమార్ ని కలిసి కాలనీలో లో– వోల్టేజ్ సమస్య రోజు రోజుకీ పెరుగుతున్నందున నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. ఎ ఈ స్పందిస్తూ కాలనీలో ట్రాన్స్ఫార్మర్ పెట్టుటకు కాళీ స్థలం చూపించినట్లయితే వెంటనే నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు చేస్తామని, వంగి పోయిన పాత స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మంగలి విఠలయ్య, కొలాన్ ప్రతాప్ రెడ్డి, మర్పల్లి అశోక్, వర కుమార్, ప్రశాంత్ కుమార్, శ్రీశైలం గౌడ్, లీల ప్రసాద్, రామచంద్రయ్య, విఠల్ రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉన్నతాధికారులను బురిడీ కొట్టించిన ప్రధానోపాధ్యాయుడు

- బయట తిరుగుతూ, బడిలో ఉన్నట్లుగా ఎఫ్ఆర్ఎస్ లో హాజరు
- రోజుల తరబడి పాఠశాల విధులకు డుమ్మా
- ఎర్రగడ్డ పాఠశాలలో విద్యార్థులతో వెట్టి చాకిరీ పనులు




**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విధులకు హాజరైనట్లుగా ఎఫ్ఆర్ఎస్ యాప్ లో హాజరు వేసుకుని,హాజరు పట్టికలో సంతకాలు పెట్టి తెలంగాణ ప్రభుత్వానికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల దీక్షలో పాల్గొన్న తిరుమలాయపాలెం మండలంలోని ఎర్రగడ్డ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పాఠశాల విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా నిత్యం చరవాణిలో సొల్లు కబుర్లు చెబుతూ తలమునకలవడం, యూనియన్ నాయకుని పేరుతో సమావేశాలంటూ యథేచ్ఛగా బడిబయట తిరుగుతూ పాఠశాలలో చదివే పేద దళిత, గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. గత ఆగష్టు,సెప్టెంబర్ నెలలోనే సదరు ప్రధానోపాధ్యాయుడు అనేక రోజుల పాటుగా ఉదయం ఎఫ్ఆర్ఎస్ యాప్ లో ఫోటోలు దిగి సొంత పనుల కోసం,ప్రయివేటు కార్యక్రమాల కోసం అనుమతి లేకుండానే బయటకి వెళ్లి తిరిగి సాయంత్రం పాఠశాలకి వచ్చి విధులకు హాజరైనట్లుగా మరోసారి ఎఫ్ఆర్ఎస్ యాప్ లో ఫోటోలు దిగి ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నారు.

### విద్యార్థులతో వెట్టి చాకిరీ పనులు పురమాయింపు..!

గురువులనే ప్రత్యక్ష దైవాలుగా పూజించే విద్యార్థుల జీవితాలకి బంగారు భవిష్యత్ వేసి వారిని సమాజంలో ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రధానోపాధ్యాయుడు తను చేయవలసిన పనులను విద్యార్థులకి పురమాయించి వెట్టి చాకిరీ పనులను ప్రోత్సహిస్తున్నారు. గతేడాది ఆగష్టు 15 సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎగురవేసిన జాతీయ జెండాను సాయంత్రం సమయంలోగా అవతనం చేసి జెండాను జాగ్రత్తగా భద్రపరచాల్సిన బాధ్యతను విస్మరించి ఇంటి బాట పట్టాడు. పాఠశాల తాళాలు విద్యార్థులకు అప్పజెప్పి జెండాను భద్రపరిచే పనిని వారితో చేయించారు. దీంతో విద్యార్థులు జెండా కడ్డీ బరువుగా ఉండటంతో వారు జెండాను తీయలేక ఆపసోపాలు పడ్డారు. జెండాను తీసే వరకు వారి ఒళ్ళంతా ముచ్చెమటలు పట్టి,ఆయాస పడ్డారు. సాధారణంగా జాతీయ జెండా ఆవిష్కరణ,అవతనం సమయంలో త్రివర్ణ పతాకం నేలను తాకకూడదు. కానీ విద్యార్థులకు బరువైన కడ్డీని మోయలేక నేల పై పెట్టారు. ప్రభుత్వం నుండి లక్షల రూపాయల వేతనం పొందుతూ తమ పిల్లలతో పనులు చేయించడమేంటని విద్యార్థులు తల్లితండ్రులు సైతం ప్రధానోపాధ్యాయుడు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారిణి అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టి ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ సమావేశాల్లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయుడు వ్యవహారం పై విచారణకి ఆదేశించారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- నేడు సిపిఎం ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్
- బిజెపి తెలంగాణ కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి
- సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్ :** సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నేడు చలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేవెళ్ల డివిజన్లోని సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిపిఎం పార్టీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు విజయవంతం చేయాలని డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు అగ్రవర్ణాల పార్టీలు తీరని అన్యాయం చేస్తున్నాయని, వారిన ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం తీర్మానం చేసి గవర్నర్కు పంపిస్తే, గవర్నర్ ఆమోదించి కేంద్రానికి పంపకుండా నిర్లక్ష్యం చేయడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీలపై ప్రేమ ఉంటే వెంటనే పార్లమెంటులో బీసీల రిజర్వేషన్ బిల్లు పెట్టి రాష్ట్రపతి చేత ఆర్డినెన్స్ పాస్ చేయించి బీసీల రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్స్ పై మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని భావించిన గతంలో వీపీ సింగ్ ప్రభుత్వానికి బిజెపి మద్దతు ఉపసంహరించుకోవడం వల్ల వీపీ సింగ్ ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. బీసీల పట్ల బిజెపి స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం షాబాద్ మండల నాయకులు శ్రీనివాస్ అర్జున్, పగులయ్య, రవి వర్ధన్ పాల్గొన్నారు.

## అమ్మ తనానికి అనేక సవాళ్లు అవసరమా ?

### ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త బండి కనకదుర్గ

**రంగారెడ్డి అక్టోబర్ 16:** సృష్టిలో ప్రతి ప్రాణికి జన్మప్రదాత అమ్మ ప్రసవ వేదనపడేది అమ్మ ప్రాణ ప్రతిష్ట పోసేది అమ్మ ప్రతి స్త్రీ జీవితంలో మాతృత్వం అనేది ఒక దివ్య మధురానుభూతి అని, ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త, బండి కనకదుర్గ పేర్కొన్నారు. గురువారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పెళ్లి అయిన ప్రతి జనతా కాలానుగుణంగా తల్లిదండ్రులు కావాలని కలలు కనడం సర్వసాధారణమని, అయితే మారిన జీవనశైలి ఉరుకులు పరుగులు పోటీలో జీవితంలో మానసిక ఒత్తిడి పర్యావరణ కాలుష్యం లాంటి కారణాలతో కొంతమం ది జంటలు ఈ కల అంత సులభంగా, సహకారం కావడం లేదని ఇటీవల కాలంలో వంధ్యత్వ శాతం నువ్వు పెరుగుదల గర్భధారణను ఆలుశం చేస్తున్న జంటల సంఖ్య పెరుగుదల పెరుగుతున్న అవగాహన కారణంగా ఇన్ విట్రో ఫెర్రిలైజేషన్( ఐవిఎఫ్) ఇతర సహాయక పునరుత్పత్తి సాంకేతికతలకు( ఏఆర్టి) డిమాండ్ పెరుగుతోందని అన్నారు కాగా భారతదేశం లో వంధ్యత్వ సమస్యతో బాధపడుతున్న గంటల కోసం ఇనోవిత్రి ఫెర్టిలైజేషన్ అత్యంత ప్రజాదారణ పొందిన అధునా తన చికిత్స భారత దేశంలో ప్రధానంగా ప్రవేటు రంగం ద్వారా చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ సామాన్యులు వాటి లభ్యతకు గననీయంగా తగ్గిపోతుందని అధిక ఖర్చులు ప్రభుత్వ రంగ సేవలో కొరత పట్టణ గ్రామీణ మౌలిక సదు-పాయాల మధ్య విస్తృత అంతరం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది అని అన్నారు ఈ సమస్యల పరిష్కా రమే లక్ష్యంగా ఇటీవల కాలంలో ప్రభుత్వ చొరవతో మారుతు న్న నిబంధనలు ప్రజలలో పెరుగుతున్న అవగాహన పరిస్థితుల్లో కొంత ఆశావాహ మార్పు గోచరిస్తున్నప్పటికీ ముఖ్యమైన అడ్డంకులు అలాగే అపరికృతంగా కొనసాగుతున్నాయని అన్నారు.



### ఇదో కొత్త సమస్య

తల్లితో జన్యుపరమైన సంబంధం లేకుండా తల్లిదండ్రుల గుడ్డు వీర్యకణాలను ఉపయోగించి ప్రయోగశాలలు పిండాన్ని తయారు చేసే తర్వాత ఆ పిండాన్ని సరోగ గట్టు తల్లి గర్భంలో ప్రవేశపెట్టే గెస్టేషనల్ సరోగసి సరోగేట్ తల్లి గుడ్డును తండ్రి వీర్యకణంతో ఫలదీకరణం చేసే ట్రెడిషనల్ సరోగసి పద్ధతుల ద్వారా తల్లికి పుట్టే బిడ్డతో జన్యుపరమైన సంబంధం ఉండడంతో న్యాయపరమైన చిక్కులు ఉండే అవకాశం ఉందని అన్నారు కాబట్టి ఈ విషయంలో ముందుగానే న్యాయపరమైన జాగ్రత్తలు తీసుకోవడం తప్ప సరోగసి (నియంత్రణ) చట్టం 20 21 వాణిజ్య సరోగసిని నిషేధించేందుకు నైతిక ప్రమాణాలను స్థాపించడానికి మహిళలను ఆర్థిక దోపిడీ నుండి రక్షించడానికి రూపొందింపబడిందని పేర్కొన్నారు భారత దేశంలో వాణిజ్యసరోకసి ప్రక్రియను నిషేధించినందున ఇప్పుడు అది అక్రమ మార్గంలో దుర్వినియోగం అవుతుందని సంతానం లేని భారతీయ గంటలకు పరోపకారం ఏర్పాట్లకు పరిమితం చేయవలసిన ఈ చట్టం దోపిడీని తొలగించడానికి బదులుగా దుర్బల మహిళలకు మరింత ప్రమాదకరంగా పరిణమించిందని పారదర్శక నియంత్రణ లేకపోవడం వల్ల ప్రధానంగా స్వల్పదాయ నేపథ్యం నమోదు కానీ దాతల ద్వారా మహిళలు ఐవిఎఫ్ దుర్వినియోగానికి గురి అవుతున్నారని తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు మహిళలు తమ అండలను అమ్ముకునేలా మధ్యవర్తులు వారిని ప్రలోభ పెట్టి బలవంతం చేస్తున్నారని అన్నారు. వాస్తవానికి సరోగసి ప్రక్రియను నిర్వహించకుండానే తరచూ పేద కుటుంబాల నుండి ఏజెంట్ల ద్వారా నవజాత శిష్యులను కొనుగోలు చేసే సంతానం లేని జంటలకు లక్షల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని దీనిని ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ కనకదుర్గ ప్రభుత్వాన్ని సూచించారు.

## బీసీ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏకగ్రీవ ఎంపిక

### తోటకూరి శ్రీకాంత్ గౌడ్



**ములుగు, రాజముద్ర న్యూస్ :** ములుగు బిసి జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా తోటకూరి శ్రీకాంత్ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయ్ భవన్ లో బీసీ జేఏసీ సాధన కోసం బీసీ కులస్తులు, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు, పటిష్టమైన నాయకత్వాన్ని బలపరిచేందుకు యువకుడైన తోటకూరి శ్రీకాంత్ గౌడ్ ను జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అన్నారు. శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం తో వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించినందుకు గాను ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తానని, జిల్లాలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసి, 42శాతం రిజర్వేషన్ సాధించేంతవరకు అందరని కలుపుకొని ఉద్యమం చేస్తామని అన్నారు.




## రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

### వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ ను సందర్శించిన రాష్ట్ర మంత్రి సీతక్క

**ములుగు జిల్లా, అక్టోబర్ 16:** రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలనీ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట లోని హరిత కాటేజ్ లో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ శిక్షణలో భాగంగా గత తొమ్మిది రోజులుగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ తెలంగాణ టూరిజం తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నడుస్తున్న ఈ శిక్షణా శిబిరాన్ని మంత్రి సీతక్క సందర్శించారు. కార్యక్రమాన్ని మంత్రి సీతక్క సందర్శించి శిక్షణ తీసుకుంటున్న వాలంటీర్స్ తో ముఖాముఖి మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క కాకతీయుల చరిత్ర గురించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రం విదేశాల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన జీవితంలో ఏ విధంగా ఈ స్థితికి వచ్చాను ఇక్కడున్న ప్రాంత ప్రాముఖ్యత గురించి తెలుసుకోవడానికి వచ్చిన మీ అందరికీ అభినందనలు మీరు ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం మీరు ఇక్కడి నుంచి వెళ్ళాక మీ ప్రదేశాల్లో కాకతీయుల గురించి వివరించాలని అన్నారు. ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ వరుసగా ఇది నాలుగవసారి వరల్డ్ హెరిటేజ్ క్యాంప్ రామప్పలో నిర్వహిస్తున్నామని ప్రతి సంవత్సరం వివిధ ప్రదేశాల నుండి వివిధ దేశాల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు కాకతీయుల కళా సంపద వారసత్వం వాటిని ఎలా కాపాడుకోవడం అనే అంశాల మీద వాటి ప్రాముఖ్యతను వివరించారు. అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ మాట్లాడుతూ మంత్రి పర్యాటక రంగానికి మేడారంకి ఏవిధంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నిస్తున్నారో టూరిజం తెలంగాణలో ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో ముఖ్యంగా యూత్ కి ప్రజలకు పర్యాటకం ఏ విధంగా దోహదపడుతుందనే అంశాల గురించి వివరించారు.



## పేదల బాగోగుల పట్ల శ్రద్ధ చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా, అక్టోబర్ 16:** పేదల కలల్ని సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ కి చెం దిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు బయ్యా ప్రమీల ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## బీసీ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు

**మిర్యాలగూడ, అక్టోబర్ 16:** ఈనెల 18న బీసీ సంఘాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. హైదరాబాద్ గాంధీభవన్‌లో బీసీ జేఎసి నేతలు ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, వి.జి.ఆర్. నారగోని, కనకాల శ్యామ్, కూర్మ వరికుప్పల మధు, గూడూరు భాస్కర్ తదితరులు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలుసుకుని బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బంద్‌కు మద్దతు ప్రకటించిందని, ఇందుకు పార్టీకి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ తెలిపారు. బంద్‌ను బీసీలు పూర్తిగా శాంతియుతంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు

### రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్



**రష్యా :** రష్యా చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్‌లో భారత్ చెల్లింపులు చేస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. అయితే అది స్వల్ప మొత్తంలోనేనని, ఎక్కువశాతం లావాదేవీలు రూబుల్స్‌లోనే జరుగుతున్నాయని స్థానిక మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా చమురుకు భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా ఉన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించిన తర్వాత ఈ చమురు కొనుగోళ్లు భారీగా పెరిగాయి. దాంతో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి వ్యాపార లావాదేవీల కోసం ప్రత్యామ్నాయ కరెన్సీలు యువాన్, యూఏఈ దిర్హమ్ వాడకం పెరిగింది. ఇదిలాఉంటే.. సెప్టెంబర్‌లో రష్యా నుంచి చమురు కోసం భారత్ 2.5 బిలియన్ యూరోలను వెచ్చించింది. అంతకుముందు నెలతో పోలిస్తే అది 14 శాతం తక్కువ కావడం గమనార్హం.

**నయారా ఎనర్జీపై యూకే ఆంక్షలు..**


రష్యా చమురురంగం, భారత్‌కు చెందిన ఇండియన్ పెట్రోలియం సంస్థ నయారా ఎనర్జీ లిమిటెడ్ లక్ష్యంగా యునైటెడ్ కింగ్డమ్ పలు ఆంక్షలు విధించింది. పుతిన్ ప్రభుత్వ ఆదాయ వనరులను దెబ్బతీసేందుకు యూకే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు యూకే ఫారెన్, కామన్‌వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్, యూకే ట్రెజరీ శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టింది. అలాగే చైనాలోని నాలుగు ఆయిల్ టర్మినల్స్, 44 ట్యాంకర్లపైనా ఆ ఆంక్షల ప్రభావం ఉంటుంది.

## అమెరికా రక్షణ మంత్రి విమానం అత్యవసర ల్యాండింగ్



**యూఎస్ :** అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ విమానం యూకేలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. విమానం విండ్‌షీల్డ్‌లో పగుళ్లు ఏర్పడటంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. బ్రస్సెల్స్‌లో నాటో రక్షణ మంత్రుల సమావేశంలో హెగ్సెత్ పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆయన తిరిగి అమెరికాకు వస్తుండగా ఇది జరిగింది. ఈ విషయాన్ని పెంటగాన్ కూడా ధ్రువీకరించింది. హెగ్సెత్‌తో సహా విమానంలోని వారంతా సురక్షితంగా ఉన్నారని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. నాటో సమావేశంలో ఉక్రెయిన్‌పై దూకుడుగా వ్యవహరిస్తున్న రష్యాకు హెగ్సెత్ కీలక హెచ్చరికలు చేశారు. మాస్కో దూకుడు ఇలాగే కొనసాగితే అమెరికా, దాని మిత్రదేశాలతో కలిసి దానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంపై కూటమి దృష్టి సారిస్తుందన్నారు.

## వెనెజువెలాలో సీఐఏ రహస్య ఆపరేషన్‌కు ట్రంప్ గ్రీన్ సిగ్నల్



**యూఎస్ :** అమెరికాలోకి అక్రమంగా మాదక ద్రవ్యాలు రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి ఆగ్రహం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కరేబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పడవలపై ఇటీవల అమెరికా సైన్యం పలుమార్లు దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక విషయం బయటపెట్టారు. వెనెజువెలాలో రహస్య కార్యకలాపాలు నిర్వహించేందుకు తాను సీఐఏకి అధికారికంగా అనుమతిచ్చినట్లు తెలిపారు. బుధవారం ఓవెల్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే దానిపై స్పష్టతనిచ్చారు. వెనెజువెలా నుంచి పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలు వస్తున్నాయన్నారు. సముద్రం ద్వారా వస్తున్న వాటిని అడ్డుకోవడంతో పాటు ఆ దేశ ప్రజలు ఇక్కడ నేరాలకు పాల్పడి యూఎస్ జైళ్లలో ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో వారు మరిన్ని దాడులకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక, వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోపై చర్యలు తీసుకొనే అధికారం సీఐఏకు ఉందా అనే ప్రశ్నకు స్పందించేందుకు ట్రంప్ నిరాకరించారు. ట్రంప్ ప్రకటనకు ముందే ది న్యూయార్క్ టైమ్స్ ఈ విషయాన్ని వెల్లడించింది. ట్రంప్ చర్యలను డెమోక్రటిక్ సెనెటర్ జీన్ షాహీన్ తప్పుబట్టారు. మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలకు తాను మద్దతిస్తానన్నారు. కానీ, కాంగ్రెస్ అనుమతి తీసుకోకుండా ఆ దేశంలో రహస్య కార్యకలాపాల కోసం సీఐఏకు అధికారం ఇవ్వడంతో పాటు పడవలపై దాడులు చేయించడం సరికాదన్నారు. ట్రంప్ పరిపాలన అమెరికాను మరొక సంఘర్షణలోకి నడిపిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటినుంచి చెబుతున్నారు. ఆ ముఠాలను అంతం చేసేందుకు ఇటీవల సైన్యాన్ని రంగంలోకి దింపారు. కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించారు. ఇప్పటివరకు యూఎస్ దళాలు ఐదు పడవలను ధ్వంసం చేశాయి. తమ దళాలు జరిపిన దాడుల్లో పలువురు మరణించారంటూ ట్రంప్ స్వయంగా పేర్కొన్నారు.

## డిజిటల్ అరెస్ట్ పేరిట..

### ఏకంగా రూ.58 కోట్ల సైబర్ మోసం

**ముంబయి :** డిజిటల్ అరెస్టు పేరిట ఓ వ్యాపారవేత్త నుంచి సైబర్ కేటుగాళ్లు ఏకంగా రూ.58 కోట్లమేర కొల్లగొట్టారు. ముంబయిలో ఈ వ్యవహారం వెలుగుచూసింది. వ్యక్తిగత డిజిటల్ అరెస్టుకు సంబంధించి నమోదైన అతిపెద్ద సైబర్ మోసాల్లో ఇది ఒకటని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో మహారాష్ట్ర సైబర్ విభాగం ముగ్గురు నిందితులను అరెస్టు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈడీ, సీబీఐ అధికారులుగా నటిస్తూ సైబర్ మోసగాళ్లు ముంబయికి చెందిన ఓ వ్యాపారవేత్త (72)ను సంప్రదించారు. మనీలాండరింగ్ కేసులో పేరు వచ్చిందని బెదిరించారు. వ్యాపారవేత్త దంపతులిద్దరినీ డిజిటల్ అరెస్టు పేరిట భయభ్రాంతులకు గురిచేశారు. నగదు బదిలీ చేయాల్సిందిగా కొన్ని బ్యాంకు ఖాతాలు పంపించారు. దీంతో ఆయన రెండు నెలల వ్యవధిలో రూ.58 కోట్లు బదిలీ చేశారు. అనంతరం తాను మోసపోయానని గుర్తించి సైబర్ పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. 18 బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. సంబంధిత అకౌంట్లను వెంటనే స్తంభింపజేయాల్సిందిగా అధికారులను సంప్రదించారు. ఈ కేసులో అబ్దుల్ ఖుల్లి, అర్జున్ కాద్వాసార, అతడి సోదరుడు జేఠారామ్‌లను అరెస్టు చేశారు.

# పాక్ సొమ్ము కోసం..

# భారత్‌పై ట్రంప్ కక్ష

- భారత్‌లో సంబంధాలు దెబ్బతీసుకుంటున్నారు
- అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఆరోపణలు



**వాషింగ్టన్, అక్టోబర్ 16 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. అందుకోసం భారత్–అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. 40ఏళ్ల వ్యూహాత్మక ప్రణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులుకుంటున్నారు. భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్–అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నారు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోంది" అని ఇమాన్యుయేల్ ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యుయేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

**ట్రంప్ మళ్లీ పాతపాటే..**

ఇదిలాఉండగా భారత్–పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్–పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. "గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారు" అని పేర్కొన్నారు.

## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారును ట్రక్కు ఢీకొనడంతో మంటలు
- మంటల్లో నలుగురు సజీవ దహనం




**జయపుర, అక్టోబర్ 16 :** రాజస్థాన్‌లో బార్మర్ జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కార్పియో కారు ఓ ట్రక్కు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. కారులో ఉన్న నలుగురు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడమలానీ తహసీల్‌లోని డాబర్ గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు పని నిమిత్తం సింధారీకి వెళ్లారు. పని ముగించుకుని అర్ధరాత్రి దాటాక తమ స్కార్పియో వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. వారి గమ్యస్థానానికి ఇంకా 30 కిలోమీటర్ల దూరంలో ఉండగా, సింధారీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదా గ్రామ సమీపంలో మెగా హైవేపై ఎదురుగా వస్తున్న ఓ ట్రైలర్‌ను వారి కారు బలంగా ఢకొ?ట్టింది. ప్రమాదం జరిగిన తీరు ఎంత తీవ్రంగా ఉందంటే, ఢకొ?న్న వెంటనే కారులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఈ ఘటనలో మోహన్ సింగ్ (35), శంభు సింగ్ (20), పంచారామ్ (22), ప్రకాశ్ (28) అనే నలుగురు యువకులు తీవ్రమైన గాయాలతో అక్కడికక్కడే మంటల్లో కాలిపోయి మరణించారు. కారు నడుపుతున్న దిలీప్ సింగ్ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



## మొన్న రోడ్లు.. నేడు చెత్త

### కిరణ్ మజుందార్ షా పోస్టు వైరల్

**బెంగళూరు :** బెంగళూరు రోడ్ల పరిస్థితిపై ప్రముఖ ఔషధ తయారీ సంస్థ బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా ఇటీవల ఓ పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె భారత్‌లో చెత్త నిర్వహణపై పెట్టిన పోస్టు వైరల్ అవుతుంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లో ఇలాంటి పరిస్థితి ఉండటంపై ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా చెత్త అనేది ఒక తీవ్రమైన సమస్య అంటూ ఆమె గురువారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. పెద్ద నగరాల్లోని మున్సిపాలిటీలు కూడా దీన్ని పరిష్కరించలేకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. ఇండోర్, సూరత్, ముంబయి, దిల్లీ, బెంగళూరు వంటి నగరాల పేర్లను ఆమె ప్రస్తావించారు. ఇది చాలా దయనీయమైన పరిస్థితి అని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇలాంటి విషయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. ప్రజలు, పాలనాధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముంబయి బాంద్రాలోని ఓ ప్రాంతంలో పడి ఉన్న చెత్తను ఉద్దేశిస్తూ జర్నలిస్టు సుచేతా దలాల్ పెట్టిన పోస్టుకు మజుందార్ షా ఇలా స్పందించారు. గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనిపై మజుందార్ షా పెట్టిన పోస్టు వైరల్ అయ్యింది. బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని ఆమె వెల్లడించారు. దీనిపై ఎందుకు తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారో అర్థంకావడం లేదంటూ ఆయన పేర్కొన్నారని తెలిపారు. ఈ పోస్టుపై కర్ణాటక మంత్రి ప్రియాంక ఖర్గే స్పందించారు. బెంగళూరులో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. మౌలిక సదుపాయాలకు అవసరమైనవన్నీ చేస్తున్నామన్నారు.

## 170 మంది మావోయిస్టులు లొంగుబాటు


### అమిత్ షా కీలక ప్రకటన



**దిల్లీ:** మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మందిబీ మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలనుకొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు.

## భారత్ తరపున అఫ్గాన్ పరోక్ష యుద్ధం

### పాక్ మంత్రి నిందలు



**పాకిస్థాన్ :** పాకిస్థాన్– అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఇరుదేశాల సైనికుల మధ్య జరిగిన దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అఫ్గాన్ దాడులను ఉద్దేశిస్తూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తరఫున అఫ్గాన్ పరోక్ష యుద్ధం చేస్తుందంటూ నిందలు మోపే ప్రయత్నం చేశారు. దాడుల నేపథ్యంలో పాక్– అఫ్గాన్‌ల మధ్య 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీనిపై కూడా ఆసిఫ్ సందేహం వ్యక్తం చేశారు. నిర్ణయాలు కాబుల్‌లో కాకుండా న్యూదిల్లీలో తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 'అఫ్గాన్‌లో భారీగా దాడులు జరిగాయి. స్నేహపూర్వక దేశాల జోక్యం తర్వాత కాల్పుల విరమణకు వారు అంగీకరించారు. కానీ, అది పేలవంగా ఉంది. ఇది ఎక్కువ కాలం ఉంటుందని అనుకోవడం లేదు' అని అన్నారు. అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ ఇటీవల భారత్‌లో పర్యటించడంపై కూడా పాక్ మంత్రి అక్కసు వెళ్లగక్కారు. ముత్తాఖీ ఆరు రోజుల పర్యటనలో పలు ప్రణాళికలు చేశారంటూ వ్యాఖ్యానించారు. ఈ పర్యటన వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఇతర ఉద్దేశాలను కలిగి ఉందన్నారు. ఇక, ఈ ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేయొద్దంటూ ఆసిఫ్ అఫ్గాన్‌కు హెచ్చరికలు చేశారు. గత కొన్ని రోజులుగా పాక్– అఫ్గాన్ సరిహద్దులో ఇరుదేశాల దళాల మధ్య తీవ్రమైన దాడులు జరిగాయి. ఈ దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే తాజాగా కాల్పుల విరమణను ఇరుదేశాలు ప్రకటించాయి. కాల్పుల విరమణ సమయంలో ఇరుపక్షాలు నిర్మాణాత్మకమైన చర్చలు జరుపుతాయని పాక్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఇందులో సానుకూలమైన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేసింది. ఇక, పాక్ కాల్పుల విరమణను ఉల్లంఘించకపోతే.. తమ దళాలు సంయమనం పాటించాలని తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది.

## నిమిష ప్రియ మరణశిక్ష..

### ఈ కేసులో అదే మంచి విషయం : కేంద్రం



**న్యూఢిల్లీ :** భారత నర్సు నిమిష ప్రియ యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఆ శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని గురువారం సుప్రీం కోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన పరిణామాలు ఏమీ జరగలేదని తెలిపింది. ఈ భారతీయ నర్సును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణ శిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తోన్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. "ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారు. ఇప్పటివరకు మంచి విషయం ఏంటంటే.. తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోకపోవడమే" అని వెల్లడించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. 2016లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. కానీ, వారు ఆమెను పట్టించుకోలేదు. దీంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ, ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా.. సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి, మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతానికి ఆ శిక్ష అమలు వాయిదాపడింది.

## మమతా బెనర్జీ తల్లి లాంటిది

### అత్యాచార బాధితురాలి తండ్రి కీలక వ్యాఖ్యలు



**పశ్చిమబెంగాల్ :** పశ్చిమబెంగాల్‌లో ఒడిశాకు చెందిన ఓ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలో మమతా వ్యాఖ్యలను తప్పుపట్టిన బాధితురాలి తండ్రి తాజాగా క్షమాపణలు చెప్పారు. మమతా మాకు తల్లిలాంటిదని పేర్కొన్నారు. అత్యాచార ఘటనపై మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బాధితురాలు అర్ధరాత్రి 12:30కి బయటకు ఎలా వచ్చిందని వ్యాఖ్యానించారు. అయితే, తన కుమార్తెను ఉద్దేశిస్తూ సీఎం చేసిన వ్యాఖ్యలను రెండు రోజుల క్రితం బాధితురాలి తండ్రి తప్పుబట్టారు. ఘటన గురించి తనకు రాత్రి 10:15 గంటలకు ఫోన్ ద్వారా తెలిసిందన్నారు. అయితే, ఈవిషయంపై బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మమతాబెనర్జీ మాకు తల్లిలాంటి వ్యక్తి. నేను ఏదైనా తప్పుగా మాట్లాడి ఉంటే క్షమించాలని ఆమెను కోరుతున్నా. నా కుమార్తెకు మాత్రం న్యాయం జరిగేందుకు సాయం చేయాలని ఆమెను అభ్యర్థిస్తున్నా' అని అన్నారు. ఈ క్రమంలో అత్యాచార ఘటన తన కుమార్తె భవిష్యత్తును ముగించేసిందన్నారు. తనకు న్యాయం జరగాలని, నిందితులకు కఠిన శిక్ష పడాలని ఆయన డిమాండ్ చేశారు. తన కుమార్తెలా ఇతర మహిళలకు ఇలాంటిది జరగకూడదన్నారు. ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాకు చెందిన యువతి(23) పశ్చిమబెంగాల్ దుర్గాపుర్‌లోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఆమె రాత్రి సమయంలో ఫ్రెండ్‌తో కలిసి బయటకు వెళ్లగా, పలువురు దుండగులు వారిని వెంబడించారు. ఫ్రెండ్‌ను తరిమేసి.. ఆ విద్యార్థినిని సమీప అడవిలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి స్నేహితుడితో సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

# మెటా వేట.. యాపిల్ ఉద్యోగికి గాలం

కృత్రిమ మేధ నిపుణులకు ప్రస్తుతం డిమాండ్ పెరిగిపోయింది. వారిని నియమించుకొనేందుకు టెక్ సంస్థలు కూడా పోటీ పడుతున్నాయి. ఇందులో మెటా మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా యాపిల్‌లోని కీలక ప్రాజెక్ట్‌కు హెడ్‌గా ఉన్న కే యాంగ్ ఆ సంస్థను వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మెటాలో చేరేందుకే ఆయన రాజీనామా చేస్తున్నట్లు సమాచారం. బ్లూమ్‌బర్గ్ తెలిపిన ఓ కథనంలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఆన్సర్, నాలెడ్జ్ అండ్ ఇన్ఫర్మేషన్‌కు సంబంధించిన విభాగానికి కే యాంగ్ ఇటీవలే హెడ్‌గా నియమితులయ్యారు. ఇది యాపిల్ తన పర్సనల్ అసిస్టెంట్ 'సిరి'ని అప్‌గ్రేడ్ చేసేందుకు కీలకమైన ప్రాజెక్ట్. ఈ క్రమంలోనే ఆయన ఆ సంస్థను వీడాలనుకోవడం గమనార్హం. ఈ తాజా కథనంపై అటు యాపిల్, మెటా సంస్థలు గాని, ఇటు కే యాంగ్ గాని ఇప్పటివరకు స్పందించలేదు. కే యాంగ్ లింక్డ్‌ఇన్ ప్రకారం 2019 నుంచి యాపిల్‌లో ఉన్నారు. కృత్రిమ మేధ నిపుణులను కాపాడుకోవడం టెక్ సంస్థలకు పెద్ద తలనొప్పిగా మారింది. కొన్నాళ్లక్రితం గూగుల్ డీప్‌మైండ్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 24 మంది ఇంజినీర్లు, రీసెర్చర్లు భారీ ప్యాకేజీలతో మైక్రోసాఫ్ట్‌లో చేరారు. మెటా ఈ నియామకాల విషయంలో మరింత దూకుడుగా ఉంది. రూ.కోట్లు ఆఫర్ చేస్తూ వారికి వల విసురుతోంది. థింకింగ్ మెషీన్లను బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసేందుకు ఆఫర్ చేయగా.. దాని వ్యవస్థాపకురాలు మీరా మురాటీ దాన్ని తిరస్కరించారు. దీంతో ఆ కంపెనీలోని 50 మంది కీలక ఉద్యోగులను తమ సంస్థలోకి లాగేసుకుంది. మెటా కూడా ఏఐ రేసులో దూకుడుగా వ్యవహరిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ వంటి



సంస్థల్లో కీలక బృందాల్లోని ఇంజినీర్లకు భారీగా ఆఫర్లు ఇస్తోంది. ఈ క్రమంలోనే కే యాంగ్‌ను కూడా తీసుకొన్నట్లు సమాచారం.






## రెండోరోజూ అదే దూకుడు..

### భారీ లాభాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ లాభాల బాట పట్టాయి. వరుసగా రెండోరోజూ భారీ లాభాల్లో ముగిశాయి. త్రైమాసిక ఫలితాలపై సానుకూల దృక్పథం, ఎఫ్ఐఐల కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్ షేర్లు ప్రధానంగా రాణించాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 25,600 మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ గడిచిన రెండు సెషన్లలో రూ.7 లక్షల కోట్లు పెరిగి రూ.467 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,794.79 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,605.43) మోస్తరు లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 83,615.48 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 862.23 పాయింట్ల లాభంతో 83,467.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.75 పాయింట్ల లాభంతో 25,585.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.83గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ లాభపడ్డాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4240 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# వన్డేలకు వీడ్కోలు పలుకుతున్నాడా!

## వైరల్‌గా మారిన విరాట్ కోహ్లీ పోస్టు



టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికి వన్డేలు మాత్రమే ఆడుతున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మళ్లీ తన ఆటతో అభిమానులను అలరించేం దుకు సిద్ధమవుతున్నాడు. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో జరగ నున్న మూడు వన్డేల సిరీస్‌కు కోహ్లీ ఎంపికయ్యాడు. ఇప్పటికే భారత జట్టుతో కలిసి ఆస్ట్రేలియాకు చేరుకున్నాడు. 2027లో ప్రపంచకప్ ఆడాలని కోరుకుంటున్న విరాట్‌కు ఈ సిరీస్ చాలా కీలకమైనదని రవిశాస్త్రి లాంటి మాజీలు అభిప్రాయపడ్డారు. ఇందులో విఫలమైతే కోహ్లీ వన్డేలకూ రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలు లేకపోలేదని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు వైరల్ అవుతోంది. 'మనం ఎప్పుడైతే చేతులెత్తేస్తామో అప్పుడు మాత్రమే మనకు ఓటమి వస్తుంది' అనే అర్థం వచ్చేలా విరాట్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. కోహ్లీ మాటల వెనక ఉన్న అంతర్యంపై ఫ్యాన్స్ రకరకాల ఊహగానాలు చేస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే పట్టుదలతో ఉన్నారనే విషయం అందరికీ తెలిసిందే. కానీ ఆ టోర్నీలో ఆడిస్తామనే గ్యారెంటీ మాత్రం వాళ్లకు దక్కట్లేదు. టీమ్‌ఇండియా కోచ్ గంభీర్ కూడా రో–కో భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వడానికి నిరాకరించాడు. ప్రపంచకప్‌నకు ఇంకా 2.5 ఏళ్ల సమయముందని, వర్తమానంపై దృష్టిపెట్టడం అవసరమన్నాడు. "50 ఓవర్ల ప్రపంచకప్‌నకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. వర్తమానంలో ఉండడం చాలా ముఖ్యం. వాళ్లిద్దరూ నాణ్యమైన ఆటగాళ్లు. ఆస్ట్రేలియా పర్యటనలో వాళ్ల అనుభవం జట్టుకు ఎంతో ఉపయో గప డుతుంది. రోహిత్, కోహ్లీ అక్కడ విజయవం తమవుతారని ఆశి స్తున్నా" అని గంభీర్ తెలిపాడు.



### ఆస్ట్రేలియా టాప్ బౌలర్లతో

## కోహ్లీ, రోహిత్‌కు కఠిన పరీక్ష

**: షేన్ వాట్సన్**

ప్రస్తుతం క్రికెట్ అభిమానుల కళ్లన్నీ ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరగనున్న వన్డే సిరీస్‌పైనే ఉన్నాయి. అక్టోబర్ 19 నుంచి మొదలుకానున్న ఈ సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడబోతున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీరిద్దరు భారత్ తరపున బరిలోకి దిగడం ఇదే తొలిసారి. టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన ఈ ద్వయం ఆస్ట్రేలియా టూర్‌లో రాణిస్తేనే తర్వాత జరిగే వన్డే మ్యాచ్‌లకు ఎంపిక చేసే అవకాశముంది. దీంతో ఈ సిరీస్ రో–కోకు కీలకంగా మారింది. అయితే, చాలా రోజుల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న రోహిత్, కోహ్లీ అత్యంత కఠినమైన సవాలును ఎదుర్కొనబోతున్నారని ఆసీస్ మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. 'సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి అడుగుపెట్టడం అంత సులభం కాదు. ముఖ్యంగా ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లు ఉన్న ఆస్ట్రేలియా వంటి జట్టును ఎదుర్కోవడం సవాలుతో కూడుకున్నది. కోహ్లీ, రోహిత్ లయను అందుకోవడానికి కొంత సమయం పట్టొచ్చు. కానీ, వారు నాణ్యమైన క్రికెటర్లు. తొందరగానే రిథమ్ అందుకుంటారని భావిస్తున్నా. రోహిత్, విరాట్‌కు ఇదే లాస్ట్ టూర్ కావచ్చు. ఆస్ట్రేలియా ప్రజలు వారిద్దరిని ఉత్సాహపరిచి తమ అభిమానాన్ని చాటుతారని అనుకుంటున్నా. చాలా ఏళ్లుగా ఆస్ట్రేలియాకు గట్టిపోటీ ఇచ్చే వాళ్లలో కోహ్లీ ఒకడు. మాతో ఆడినప్పుడల్లా మంచి ప్రదర్శన చేస్తాడు. అతనిలో పోటీతత్వం ఎక్కువ. రోహిత్ కూడా అద్భుతమైన ప్లేయర్, కెప్టెన్. బాగా ఆడిన ప్రతిఒక్కరిని ఆస్ట్రేలియా ప్రజలు అభినందిస్తారు. అందుకు కోహ్లీ, రోహిత్ ఉదాహరణగా నిలుస్తారు' అని వాట్సన్ వివరించాడు.

## కొత్త చెస్ టోర్నీ వస్తోంది..

**దిల్లీ:** టోటల్ చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్నట్లు నార్వే చెస్ నిర్వాహకులు ప్రకటించారు. ఈ టూర్‌లో భాగంగా ప్రతి ఏడాది నాలుగు ఈవెంట్లు ఉంటాయి. ఫాస్ట్ క్లాసిక్, ర్యాపిడ్, బ్లిట్జ్‌లో క్రీడాకారులు పోటీపడాల్సివుంటుంది. అన్ని విభాగాలు కలిపి విజేతను నిర్ణయిస్తారు. టోర్నీ నిర్వహణ కోసం ప్రపంచ చెస్ సమాఖ్య (ఫిడే)తో తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు నార్వే చెస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కెజెల్ మడ్లాండ్ తెలిపాడు. "టూర్‌లో భాగంగా నాలుగు టోర్నమెంట్లు ఉంటాయి. నలుగురు అత్యుత్తమ ఆటగాళ్లు చివరిదైన నాలుగో టోర్నీకి అర్హత సాధిస్తారు" అని అతడు వివరించాడు. ఈ వార్షిక టోర్నమెంట్ 2027లో మొదలవుతుంది.

## ఆస్ట్రేలియాకు బయల్దేరిన టీమ్‌ఇండియా



**దిల్లీ:** భారత క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సిరీస్ కోసం టీమ్‌ఇండియా ఆస్ట్రేలియాకు బయల్దేరింది. అంతర్జాతీయ క్రికెట్లో టీ20లు, టెస్టులకు గుడ్‌బై చెప్పేసి, వన్డేలకు మాత్రమే పరిమితమైన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. ఆదివారం ఆస్ట్రేలియాతో ఆరంభమయ్యే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో బరిలోకి దిగనున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం రో–కో జట్టుతో కలిశారు. వీళ్లిద్దరితో పాటు కొత్త వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్.. ఆల్‌రౌండర్లు నితీశ్‌కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్.. పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ దిల్లీ విమానాశ్రయం నుంచి బుధవారం ఉదయం ఆస్ట్రేలియాకు బయల్దేరారు. కోచ్ గౌతమ్ గంభీర్, ఇతర జట్టు సభ్యులు సాయంత్రం మరో బృందంగా విమానం ఎక్కారు. దిల్లీలో విమానాశ్రయానికి బయల్దేరే ముందు తన సహచరులను కలుసుకున్న సందర్భంగా రోహిత్ శర్మ స్పందించిన తీరు అభిమానుల దృష్టిని ఆకర్షించింది. తన కంటే ముందు బస్సు ఎక్కి కూర్చున్న కోహ్లిని చూసిన రోహిత్.. అతడికి తలవంచి నమస్కారం పెట్టాడు. అందుకు కోహ్లి నవ్వుతూ స్పందించాడు. అంతకంటే ముందు తన నుంచి కొత్తగా వన్డే పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ పలకరించినపుడు.. రోహిత్ అతణ్ని దగ్గరికి తీసుకుని, కౌగిలించుకున్నాడు. బస్సు దిగి విమానాశ్రయంలోకి వెళ్తుండగా రోహిత్, కోహ్లిలను చూసేందుకు విమానాశ్రయంలో అభిమానులు పెద్ద ఎత్తున బారులు తీరారు. రో–కో వారికి అభివాదం చేస్తూ, ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ లోపలికి వెళ్లారు.


## ఆస్ట్రేలియాతో తొలి వన్డే..

### అరుదైన ఘనత అందుకోనున్న రోహిత్ శర్మ

ఆస్ట్రేలియాతో వైట్ బాల్ సిరీస్‌లో తలపడేందుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. కంగారులతో అక్టోబర్ 19 నుంచి మూడు వన్డే సిరీస్‌లు, ఇదేనెల 29 నుంచి ఐదు టీ20లు ఆడనుంది. ఇప్పటికే వన్డే జట్టు ఆస్ట్రేలియాకు చేరుకుంది. పెర్త్‌లో తొలి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అరుదైన ఘనత అందుకోనున్నాడు. హిట్‌మ్యాన్‌కు అంతర్జాతీయ కెరీర్‌లో ఇది 500వ మ్యాచ్. ఇప్పటివరకు భారత్ తరఫున నలుగురు మాత్రమే ఈ ఫీట్ సాధించారు. సచిన్ తెందూల్కర్ (664), విరాట్ కోహ్లీ (550, ఎంఎస్ ధోనీ (535), రాహుల్ ద్రవిడ్ (504) ఐదు వందలకు పైగా మ్యాచ్ లు ఆడారు. తాజాగా ఈ జాబితాలో రోహిత్ చేరబోతున్నాడు. ఇప్పటివరకు ఇతను 67 టెస్టులు, 273 వన్డేలు, 159 టీ20లు ఆడాడు.

## రిఫర్ చేయండి.. బోనస్ పట్టండి

### లేఆఫ్‌ల వేళ ఉద్యోగులకు ఇన్ఫోసిస్ బంపర్ ఆఫర్




ఓవైపు టెక్ సంస్థల్లో లేఆఫ్‌లు కొనసాగుతోన్న వేళ.. దేశీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థలో లాటరల్ హైరింగ్ నియామకాల బాధ్యతను ఉద్యోగులకే అప్పగించింది. కొత్త టాలెంట్ వెతికి వారిని కంపెనీకి రిఫర్ చేస్తే రూ.50వేల వరకు ప్రోత్సాహకాలు ఇస్తామని బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ మేరకు తమ ఉద్యోగులకు ఇన్ఫోసిస్ ఇంటర్నల్ మెయిల్‌లో సందేశం పంపింది. ఇంజినీరింగ్, క్వాలిటీ ఇంజినీరింగ్, స్ట్రాటజిక్ టెక్నాలజీ గ్రూప్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ ఇంటిగ్రేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లో ఇన్ఫీ ఈ నియామకాలు చేపట్టనుంది. దేశవ్యాప్తంగా తమ అన్ని బ్రాంచీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు రిక్రూట్‌మెంట్ చేపట్టింది. పొజిషన్ బట్టి రెండు నుంచి 15 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులను తీసుకోనుంది. ఆయా విభాగాల్లో అర్హత కలిగిన అభ్యర్థులను ఉద్యోగులు కంపెనీకి సిఫార్సు చేయొచ్చని ఇన్ఫీ తమ మెయిల్‌లో వెల్లడించింది. ఉద్యోగులు రిఫర్ చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయితే.. ఆ ఉద్యోగులకు ప్రోత్సాహకం దక్కనుంది. లెవల్–3 నియామకాలకు రూ.10వేలు, లెవల్–4 జాబ్‌లకు రూ.25వేలు, లెవల్–5లో రూ.35వేలు, లెవల్–6 ఉద్యోగాలకు రిఫర్ చేసిన వారికి రూ.50వేలు బోనస్ ఇస్తామని కంపెనీ వెల్లడించింది. అయితే, ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థి గత ఆరు నెలల్లో ఇన్ఫీ ఎంపిక ప్రక్రియకు హాజరుకాని వారై ఉండాలని షరతు పెట్టింది. ఇటీవల టీసీఎస్ భారీస్థాయిలో లేఆఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ ఇన్ఫీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక, ఇన్ఫోసిస్ తమ రెండో త్రైమాసిక ఫలితాలను గురువారం (అక్టోబరు 16న) ప్రకటించనుంది. మరోవైపు ఉద్యోగి పనితీరు పైనా కంపెనీ సమీక్ష ప్రారంభించింది. దీంతో త్వరలోనే కంపెనీలో వేతన పెంపు ఉండొచ్చనే సంకేతాలు కన్పిస్తున్నాయి.



## దీపావళి ముందు వారికి 'గోల్డెన్' ఛాన్స్

### బాండ్లపై 338% లాభం

పెరిగిన బంగారం ధరలు చూసి ఓవైపు సామాన్యులు ముక్కున వేలేసుకుంటుండగా.. 8 ఏళ్ల క్రితం పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టినవారు మాత్రం గోల్డెన్ ఛాన్స్ కొట్టేశారు. 2017–18 సిరీస్–3 గోల్డ్ బాండ్లు కొనుగోలు చేసినవారు దీపావళి ముందు బంపర్ గిఫ్ట్ అందుకున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి ఫైనల్ రిడెంప్షన్ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించడమే ఇందుక్కారణం. అప్పట్లో పెట్టుబడి పెట్టిన వారికి 338 శాతం ప్రతిఫలం లభించడం విశేషం. 2017–18 సిరీస్–3ని 2017 అక్టోబర్ 16న ఆర్‌బీఐ ఈ బాండ్ల కొనుగోలుకు అందుబాటులో ఉంచింది. అప్పట్లో గ్రాము బంగారం ధరను రూ.2,866గా నిర్ణయించారు. ఈ బాండ్ల కాలపరిమితి 8 ఏళ్లు కావడంతో తాజాగా మెచ్యూరిటీకి వచ్చాయి. 999 స్వచ్ఛత కలిగిన బంగారం గ్రాము ధరను రూ.12,567గా ఆర్‌బీఐ నిర్ణయించింది. ఈ మొత్తం నుంచి కొనుగోలు ధరను మినహాయిస్తే ఒక్కో గ్రాముపై రూ.9,701 ప్రతిఫలం వచ్చినట్లు లెక్క. దీన్ని శాతాల్లో లెక్కిస్తే 338 శాతం అవుతుంది. దీనికి ఏటా చెల్లించే 2.5 శాతం వడ్డీ అదనం. అంటే ఈ మొత్తం ఇంకా ఎక్కువనే చెప్పాలి.

### ఏమిటీ పథకం?

దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబర్‌లో ఆర్‌బీఐ ఈ పథకం తీసుకొచ్చింది. వీటి కాలపరిమితి 8 ఏళ్లు. గ్రాము ధర నిర్ణయించేందుకు రిడెంప్షన్‌కు ముందు వారం చివరి మూడు రోజుల ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. అలా గ్రాము ధరను రూ.12,567గా నిర్ణయించారు. అక్టోబర్ 13, 14, 15 తేదీల సగటును ఆధారంగా చేసుకున్నారు. ఇటీవల బంగారం ధరలు చుక్కలు తాకుతున్న వేళ బాండ్లు రిడెంప్షన్‌కు రావడంతో మదుపర్ల పంట పండిందనే చెప్పాలి. పైగా వచ్చిన మొత్తానికి ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించక్కర్లేదు. 2015–16 బడ్జెట్‌లో తీసుకొచ్చిన ఈ పథకం కింద కేంద్రం తరఫున ఆర్‌బీఐ ఈ బాండ్లను జారీ చేస్తుంది. అయితే, చివరిసారిగా 2024 ఫిబ్రవరిలో సబ్‌స్క్రిప్షన్‌కు అనుమతిచ్చారు. ఆ తర్వాత ఈ బాండ్లను జారీ చేయలేదు. ఖజానాకు భారం కావడంతో ఈ బాండ్ల జారీని ప్రభుత్వం నిలిపివేసింది.




## నెస్లేలో భారీ లేఆఫ్‌లు..

### 16వేల ఉద్యోగాల కోత..

**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ ఫుడ్ కంపెనీ నెస్లే భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. 16వేల మంది ఉద్యోగులను తొలగింపునకు సన్నాహాలు చేస్తున్నట్లు సీఈఓ ఫిలిప్ నవ్రాటిల్ గురువారం వెల్లడించారు. రానున్న రెండేళ్ల కాలానికి ఈ తొలగింపు ఉంటుందని తెలిపారు. "ప్రపంచం మారుతోంది. దానికి తగ్గట్టే నెస్లే వేగంగా మారాలి. ఇది కఠిమైన నిర్ణయమే అయినప్పటికీ.. ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం ఆ మార్పులో భాగం" అని ఒక ప్రకటనలో భాగంగా సీఈఓ వెల్లడించారు. ఉత్పత్తి, సరఫరా విభాగాల్లో ఇప్పటికే 4 వేల మంది ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. దాంతోపాటు మరో 12 వేల మంది వైట్‌కాలర్ సిబ్బంది ఈ లేఆఫ్‌లో భాగం కానున్నారు. ఈ కోత వల్ల సంస్థకు ఒక బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ ఆదా కానున్నాయి. 2027 నాటికి నెస్లే తన పొదుపు లక్ష్యాన్ని 3 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా నిర్ణయించుకుంది. 2000 బ్రాండ్లు కలిగిన ఈ స్విస్ సంస్థ సెప్టెంబర్‌లో నాయకత్వ అస్థిరతను ఎదుర్కొంది. తన సబార్డినేట్‌తో ప్రేమ వ్యవహారం నడిపిన లారెంట్ ఫ్రీక్సే తన సీఈఓ పదవిని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇది సంస్థ నిబంధనలకు విరుద్ధమని నెస్లే ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ఆయన్ను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించినట్లు వెల్లడించింది. తమ విలువలు కంపెనీకి బలమైన పునాదులని ఛైర్మన్ పాల్ బుల్కే ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. తర్వాత పాల్ కూడా తన పదవి నుంచి దిగిపోయారు. అనుకున్న సమయం కంటే ముందుగానే ఆయన రాజీనామా చేశారు. ఇక ఇటీవల రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన ఈ కంపెనీ.. అంచనాలకు మించే రాణించినప్పటికీ అంతక్రితం ఏడాదితో పోలిస్తే లాభంలో 24 శాతం క్షీణత కనిపించింది.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

# పెద్ది నుంచి త్వరలో లవ్ సాంగ్



రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ కథానాయికగా ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం పెద్ది . ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సిక్సర్ కొట్టి అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ పెంచేసింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఆ క్రేజ్ మరింత రెట్టింపు అయింది. దసరాకు వస్తుందనుకున్న ఫస్ట్ సింగిల్ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. అయితే దర్శకుడు బుచ్చిబాబు దీపావళికి దద్దరిలే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తాజా అప్‌డేట్ ఇచ్చారు దర్శకుడు సానా బుచ్చిబాబు. ఆ కార్యక్రమంలో పెద్ది విశేషాలేంటని యాంకర్ ప్రశ్నించగా త్వరలో మంచి లవ్ సాంగ్ ప్రేక్షకుల ముందుకురాబోతుందని. ఆ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ అదిరిపోయేలా మ్యూజిక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఆ అప్‌డేట్ ఫ్యాన్స్‌లో ఉత్సాహం నింపింది. అయితే ఈ పాట దీపావళికే వస్తుందని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. దర్శకుడు దానిపై క్లారిటీ ఇవ్వలేదు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఉప్పెన బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.



## అలా.. తొలి భారతీయ నటిగా కృతిసనన్

బెర్లిన్‌లో నిర్వహించిన వరల్డ్ హెల్త్ సమ్మిట్- 2025లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కృతిసనన్ నిలిచారు. ఈ వేదికపై ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది మహిళలు ఉన్నప్పటికీ వారి వైద్యానికి సరిపడినన్ని నిధులు ఉండటం లేదన్నారు. మహిళల ఆరోగ్యంతోపాటు లింగ సమానత్వం కోసం అధికంగా పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. మహిళల ఆరోగ్యమనేది తేలిగ్గా తీసుకునే అంశం కాదని, మానవాళి భవిష్యత్తుకు మూలస్తంభం లాంటిదని పేర్కొన్నారు. 'ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్' ఇండియాకు లింగ సమానత్వ గౌరవ రాయబారిగా కృతి సెప్టెంబరులో ఎంపికైన సంగతి తెలిసిందే.




## కాంతారా చాప్టర్1 కు దీపావళి వెలుగులు

హిట్ మూవీ కాంతారకు ప్రీక్వెల్‌గా తెరకెక్కి ఆ చిత్రానికి మించిన విజయం అందుకుంది కాంతార చాప్టర్ అక్టోబరు 2న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా 12 రోజుల్లో రూ.675 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. దీపావళిని పురస్కరించుకుని కొత్త ట్రైలర్ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. సినిమాలోని పలు కీలక సన్నివేశాలతో రూపొందించిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి హీరోగా నటించిన సంగతి తెలిసిందే.



## వెట్రిమారన్ తెలుగు సామ్రాజ్యం

తమిళ దర్శకులలో వెట్రిమారన్ ది ఓ ప్రత్యేక శైలి. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచి, వారి సమస్యలను తెరకెక్కించడంలో వెట్రిమారన్ దిట్ట. అంతేకాదు... వేరే దర్శకులతోనూ ఇలాంటి కథలనే సినిమాలుగా నిర్మించిన వ్యక్తి వెట్రిమారన్. తెలుగులోని స్టార్ దర్శకులతో సినిమాలు చేయాలని ఆయన కొంతకాలంగా అనుకుంటున్నారు. కానీ ఏ ప్రాజెక్ట్ కూడా సెట్ కావడం లేదు. ఎన్టీఆర్ తోనూ వెట్రిమారన్ సినిమా చేస్తే బాగుంటుందని భావిస్తున్న అభిమానులు చాలా మందే ఉన్నారు. ఆ మధ్య సూర్య హీరోగా వెట్రిమారన్ ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ అనివార్య కారణాలతో ఆగిపోవడంతో ఇప్పుడు శింబుతో అరసన్ మూవీని చేస్తున్నాడు వెట్రిమారన్. ఈ సినిమా తెలుగు వర్షన్ కు ఎన్టీఆర్ సైతం తన గొంతుతో చేయూతనివ్వబోతున్నాడు. శిలంబరసన్, వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కుతున్న అరసన్‌ను తెలుగులో సామ్రాజ్యం పేరుతో డబ్ చేస్తున్నారు. దీని ప్రోమో శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో రాబోతోంది. ఈ మధ్య ఎన్టీఆర్ కింగ్ డమ్ మూవీకి వాయిస్ ఓవర్ అందించాడు. ఆ సినిమాను హిందీలో సామ్రాజ్య పేరుతో డబ్ చేశారు. ఇప్పుడు అరసన్ మూవీని తెలుగులో సామ్రాజ్యంగా డబ్ చేయడం, దాని ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడం విశేషం. మొత్తానికి సామ్రాజ్యం అనే టైటిల్ కు ఎన్టీఆర్ కు ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాను సీనియర్ నిర్మాత థాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ కు, హీరో శింబుకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. బేసికల్ గా మంచి సింగర్ అయిన శింబు తెలుగు సినిమాల్లో కొన్ని పాటలు పాడాడు. అందులో ఎన్టీఆర్ బాద్ షా మూవీ కూడా ఒకటి. ఇటు దర్శకుడు, అటు కథానాయకుడు ఇద్దరితో ఉన్న అనుబంధం కారణంగా సామ్రాజ్యం ప్రోమోకు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడని అంటున్నారు.

## రూ.60 కోట్లు డిపాజిట్ చేయమన్న కోర్టు..

### శిల్పాశెట్టి దంపతుల పిటిషన్ విత్‌డ్రా



విదేశీ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ శిల్పాశెట్టి దంపతులు బాంబే హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ పిటిషన్‌ను వారు విత్‌డ్రా చేసుకున్నారు. ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో శిల్పాశెట్టి, ఆమె భర్త రాజ్‌కుంద్రా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరికి ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం లుకౌట్ నోటీసులు (ఎల్‌వోసీ) కూడా జారీ చేసింది. దాన్ని కొట్టివేయాలని కోరుతూ.. వృత్తిపరంగా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ కొన్ని రోజుల క్రితం పిటిషన్ దాఖలు చేయగా కోర్టు తిరస్కరించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలంటే ముందు రూ.60 కోట్లు డిపాజిట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ క్రమంలో విత్‌డ్రా చేసుకున్నారు.

## సక్సెస్‌కు రవితేజ ఎదురుచూపు



మాస్ మహరాజా రవితేజ కు సాలీడ్ హిట్ పడి చాలా కాలమే అయ్యింది. చిరంజీవితో కలిసి రవితేజ నటించిన వాల్తేరు వీరయ్య తర్వాత మళ్ళీ ఆ స్థాయి సక్సెస్ ను రవితేజ చూడలేదు. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు మాత్రం రవితేజ చేసేస్తున్నాడు. అక్టోబర్ 31న రవితేజ 75వ చిత్రం మాస్ జాతర జనం ముందుకు రాబోతోంది. ధమాకాతర్వాత శ్రీలీల మరోసారి ఈ సినిమాలో రవితేజతో జోడీ కట్టింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు బాగానే అలరిస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ కు చెందిన సినిమా. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న 76వ చిత్రానికి కూడా ఒకప్పటి రచయిత కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నాడు. నేను శైలగ, ఉన్నది ఒకటే జిందగీ, రెడ్ వంటి రొమాంటిక్, యాక్షన్ మూవీస్ ను తీసిన అనుభవం కిశోర్ తిరుమలకు ఉంది. పైగా అతనిది మంచి పెన్. రవితేజ సరసన ఈ సినిమా ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్పెయిన్ లో జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు మొదట్లో అనార్కలి అనే టైటిల్ అనుకున్నారు. కానీ ఇప్పుడీ సినిమాకు భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే పేరు పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాబోయే సంక్రాంతి బరిలో ఈ సినిమా కూడా నిలుస్తుందని అంటున్నారు. ఇది ఫ్యామిలీ డ్రామా. ఇక రవితేజ చేయబోతున్న 77వ చిత్రాన్ని శివ నిర్వాణ డైరెక్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. నిన్ను కోరి, మజిలి, టక్ జగదీశ్, ఖుషీ సినిమాలను తెరకెక్కించిన శివ నిర్వాణ ఈసారి థ్రిల్లర్ డ్రామాను తీయబోతున్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ దీనిని ప్రొడ్యూస్ చేస్తుందని తెలుస్తోంది. ఇందులో రవితేజ తన వయసుకు తగ్గ పాత్ర చేస్తాడని అంటున్నారు. ఇక రవితేజ చేయబోతున్న 78వ సినిమాను కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేస్తాడని సమాచారం.



## వరుస సినిమాలతో అనుపమ దూకుడు

మలయాళ ముద్దుగుమ్మ అనుపమా పరమేశ్వర్ ఒక్కసారిగా తన జోరు పెంచింది. గత రెండు మూడేళ్ళుగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలన్నీ వరుస పెట్టి విడుదల కావడం మొదలైంది. దాంతో ఈ యేడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన సినిమా మొత్తం ఆరు జనం ముందుకు వచ్చినట్టయ్యింది. విశేషం ఏమంటే ఈ ముద్దుగమ్మ నటించిన నాలుగు చిత్రాలు ఇప్పటికే ఈ యేడాది విడుదల కాగా, గురువారం ఓ మలయాళ చిత్రం, శుక్రవారం తమిళ చిత్రం జనం ముందుకు వస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలోనే ప్రదీప్ రంగనాథన్ సరసన అనుపమా పరమేశ్వరన్ నటించిన డ్రాగన్ మూవీ విడుదలైంది. ఇది తెలుగులోనూ వచ్చింది. ఆ తర్వాత అనుపమా పరమేశ్వరన్ నటించిన మలయాళ చిత్రం జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ సినిమా వచ్చింది.అనుపమా ఎంతో ఇష్టంగా చేసిన సినిమా పరదా. తెలుగులో సినిమా బండి, శుభం చిత్రాలను తెరకెక్కించిన ప్రవీణ్ కాండ్రేగుల ఈ సినిమాను రూపొందించాడు. విడుదలకు ముందు ఎంతో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ఆ తర్వాత పెద్దంత ప్రభావాన్ని చూపించలేక పోయింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో అనుపమా పరమేశ్వరన్ భావోద్వేగానికి గురి కావడంతో అప్పట్లో సోషల్ మీడియాలో ఆమె గురించి విశేష ప్రచారం జరిగింది. ఇక ఈ యేడాది వచ్చిన అనుపమా పరమేశ్వరన్ నాలుగో చిత్రం కిష్కింధపురి . బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో గతంలో రాక్షసుడు మూవీలో నటించిన అనుపమా పరమేశ్వరన్. మరోసారి వీరిద్దరి కాంబోలో వచ్చిన కిష్కింధపురి థియేట్రికల్ గా ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయినా... ఓటీటీలో మంచి స్పందనే దీనికి లభించింది. తాజాగా దీపావళి కానుకగా అనుపమా పరమేశ్వరన్ నటించిన ది పెట్ డిటెక్టివ్ అనే మలయాళ చిత్రం గురువారం జనం ముందుకు వచ్చింది. నిజానికి ఇది గత యేడాది విడుదల కావాల్సిన సినిమా. రకరకాల కారణాలతో వాయిదా పడి ఎట్టకేలకు విడుదలైంది. ఇక శుక్రవారం ఆమె నటించిన తమిళ చిత్రం బైసన్ విడుదల కాబోతోంది. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సీనియర్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించాడు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. బైసన్ తెలుగు వర్షన్ ఓ వారం తర్వాత 24న విడుదల కాబోతోంది. గతంలో మారి సెల్వరాజ్ తెరకెక్కించిన పరియేరుమ్ పెరుమాళ్‌లో తనకు నటించే అవకాశం వచ్చిందని, కానీ అప్పుడు దాన్ని ఉపయోగించుకోలేక పోయానని, ఇప్పుడు మరోసారి ఆయన మూవీ బైసన్‌లో ఛాన్స్ దక్కడం ఆనందాన్ని కలిగించిందని అనుపమా చెబుతోంది. మరి ఈ రెండు సినిమాల్లో ఏదైనా ఆమెకు మెమొరబుల్ హిట్ ను అందిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com